RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 252 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: గురువారం 16-04-2026 పేజీలు : 12 వెల: 1-00

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో తెరపైకి కొత్త పేరు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో కొత్త పేరు తెరపైకి వచ్చింది. గతేడాది డ్రగ్స్ ఓవర్ డోస్‌తో కేదార్ అనే వ్యక్తి దుబాయ్‌లో మృతి చెందాడు. కేదార్‌తో రోహిత్‌రెడ్డి సోదరులకు సంబంధాలు ఉన్నట్లు కస్టడీ రిక్వెస్ట్ కాపీలో పోలీసులు వెల్లడించారు. కేదార్‌కు రోహిత్‌రెడ్డి మధ్య అనేక లావాదేవీలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతాల నుంచి కేదార్‌కు రూ.25 లక్షల లావాదేవీలు గుర్తించినట్లు తెలిపారు.



# మహిళా బిల్లుకు ఓకే... డీలిమిటేషన్ బిల్లుకు నో

### వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలో మిగతా 2లో..

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ... ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

### వాడీవేడిగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు మిగతా 2లో..

## దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు

### నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం... తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు

### నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు



**చెన్నై, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** దేశ రాజకీయాల్లో నియోజక వర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు మిగతా 2లో..

## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

### పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, మిగతా 2లో..

## సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీఎం రేవంత్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్‌పై చర్చించారు. సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మార్పు, జగిత్యాల నియోజకవర్గంలో పరిణామాలపై కూడా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రులపై, ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఈ భేటీలో చర్చించారు. సీఎం నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది.

## ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి

### ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో సీఎం మమతా బెనర్జీ



**కలకత్తా, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాను ప్రయాణిస్తున్న వాహనాన్ని చెక్ చేసేందుకు కేంద్ర బలగాలు యత్నించాయని దీదీ ఆరోపించారు. కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే తనిఖీ చేయాలంటూ ఆదేశాలు అందాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మమత మాట్లాడుతూ "ఈరోజు ఉదయం కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా మిగతా 2లో..

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు


- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం మిగతా 2లో..

## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

### ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించిన ప్రధాని మోదీ




**బెంగుళూరు, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

- నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
- పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
- అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
- 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
- జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
- రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
- ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
- నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
- ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## 20న సీఎం రేవంత్ కాళేశ్వరం పర్యటన



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించనున్నారు. అనంతరం సరస్వతి నది అంత్య పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్‌బాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మొదటి పేజీ తరువాయిలు

## దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు

ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

## తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు

ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

## ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి

కేంద్ర బలగాలు నా కారును చెక్ చేయడానికి ప్రయత్నించాయి. ఒకవేళ మీకు ధైర్యం ఉంటే నా కారును రోజూ తనిఖీ చేయండి. కేవలం టీఎంసీ నాయకుల వాహనాల్లోనే ఈ చెకింగ్‌లు జరుగుతున్నాయి" అని ఆరోపించారు. దీదీ మేనల్లుడు, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ వాహనాన్ని కూడా తనిఖీ చేసినట్టు సమాచారం. " కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే లక్ష్యంగా చేసుకొంటున్నారు. ఇది కుట్రపూరిత చర్యే" అని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# మహిళా బిల్లుకు ఓకే... డీలిమిటేషన్ బిల్లుకు నో

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి



అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించుకోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

## మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

### మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

### పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి... కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు.



కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ౧÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

## ఏసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్ .... 50వేలు లంచం తీసుకుంటండగా పట్టివేత

**కరీంనగర్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కరీంనగర్ జిల్లాలో అవినీతి మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్.. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు.జిల్లాలోని హుజురాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నుసం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. పట్టణంలో నిర్మించిన స్ట్రోమ్ డైనేజీకి సంబంధించిన ఫైనల్ బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్‌లో నమోదు చేయాలని అధికారులను సంప్రదించాడు. అయితే ఏఈ సుధాకర్‌రెడ్డి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా బుధవారం హుజురాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈపై కేసు నమోదు చేసి ,అరెస్టు చేశామని, అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ కు చెందిన సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి రూ 50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు సుధాకర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు.

# మీ సేవ కేంద్రాల్లో అవినీతి

### సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు

### ఫిర్యాదులు రావడంతో ఏసిబి సోదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్‌లో మీసేవ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌర సేవ పత్రాల జారీలో దళారుల ద్వారా మీసేవ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బుధవారం ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజలను ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీ సేవల్లో దోపిడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారు. టెక్నాలజీతో పౌర సేవలను మరింత సులభతరం చేస్తున్నామంటూ అన్ని సేవలను మీ సేవ కేంద్రాలకు అప్పగించి అధికారులు మాత్రం చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 చెల్లిస్తే చాలు. కానీ, ఈ ఫీజు ఎక్కడా తీసుకోవడం లేదు. దాదాపు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు చెప్తున్నారు. క్యాస్ట్, లోకల్, ఇన్కమ్ సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇది హైదరాబాద్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో తప్పనిసరి అనే రూలేవు. హైదరాబాద్ జిల్లాలో కూడా ఇదివరకు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకొని ఉంటే ఆ సర్టిఫికెట్ ఆధారంగా మళ్లీ అప్లై చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ, మీ సేవలో మాత్రం అదేమీ కుదరదని, అఫిడవిట్ కచ్చితంగా కావాల్సిందేనని వందల్లో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల స్పష్టమైన సమాచారంతో చార్ట్ ఏర్పాటు చేయడంలేదు. ఒకవేళ చార్ట్ పెట్టినా ఆ ధరలు కనిపించకుండా చిన్న అక్షరాలతో మొక్కుబడిగా ఏర్పాటు చేస్తున్నారు.మీసేవ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని మీ సేవకు సంబంధించిన ఉన్నతాధికారులు చెప్తున్నారు. సెంటర్లలో ఖచ్చితంగా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, అందులో చెప్పిన ధరలనే తీసుకోవాలంటున్నారు. ఎక్కడైనా ఎక్కువ డబ్బులు తీసుకున్నట్టు దృష్టికి వస్తే డయల్ 1100 లేదా 18004251110 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇస్తే యాక్షన్ తీసుకుంటామంటున్నారు అధికారులు.

## పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు

### మీడియా ముందు మంగ్లీ ఆవేదన

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజులుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈ స్కామ్‌కి మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు' అని అన్నారు.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

### ధరలు తగ్గించి కొనడంపై ఆందోళన

**నిజామాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిజామాబాద్ మార్కెట్ యార్డుపై పసుపు రైతులు దాడికి దిగారు. బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తూ పసుపు ధర తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఒక ధర ఉంటే.. ఆఫ్ లైన్ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు.. ఆఫీస్ పై దాడి చేశారు. మార్కెట్ అధికారులను ఘెరావ్ చేశారు. కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. మార్కెట్ లో బహిరంగవేలం ద్వారా జరుగుతున్న కొనుగోళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు అమ్మకానికి వచ్చింది.


దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ) లిమిటెడ్
ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్

టెండర్ నోటీస్.01/2026-27 (పేపర్ నోటిఫికేషన్)

TGSPDCL సంస్థ వివిధ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తోంది. అనుభవం కలిగిన కాంట్రాక్టర్లు క్రింది పనుల కోసం దరఖాస్తు చేయవచ్చు: (1,2,3,4 & 5) బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని అన్ని సబ్ డివిజన్లలో యూనిఫాం సర్వీస్ లైన్ చార్జీల కింద సర్వీసుల విడుదల కోసం సరఫరా విస్తరణ పనులు (6) CBD గ్రీన్‌లాండ్స్‌లో లైన్ AB స్విచ్‌ల సరిదిద్దడం (7) SR నగర్‌లోని 160 KVA సతీష్ వైన్స్, బీకే గూడ DTR వద్ద LT అదనపు సర్క్యూట్ల ఏర్పాటు (8) CBD గ్రీన్‌లాండ్స్‌లో 315 మీటర్ల కొత్త 11KV 3X300 చ.మి.మి XLPE UG కేబుల్ వేసే పని (9) SR నగర్‌లో పాడైన పాత ప్లింత్‌ల స్థానంలో కొత్త ప్లింత్ నిర్మాణం (10) CBD గ్రీన్‌లాండ్స్‌లో కాలిపోయిన 11KV AB కేబుల్ మార్పిడి (11) CBD గ్రీన్‌లాండ్స్‌లో 11KV హిందూ ఫీడర్ పై గణేశ ఆలయం సమీపంలో ఉన్న దెబ్బతిన్న OH లైన్ తొలగింపు (12) మైత్రివనం SS నుండి అమీర్‌పేట్ ఫీడర్‌ను CBD గ్రీన్‌లాండ్స్‌లో ఇంటర్‌లింక్ చేయడం (13) గ్రీన్‌లాండ్స్ సెక్షన్‌లో LT 3X1/2 185 చ.మి.మి UG కేబుల్ వేసి సర్క్యూట్ ఏర్పాటు
మరిన్ని వివరాల కోసం: www.tgsouthernpower.org ను సందర్శించండి.

సం//-
సూపరింటెండింగ్ ఇంజనీర్
ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్

DIPR R.O.NO : 695-PP/CL/ADVT/1/2026-27

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్దత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్గ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్ధ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

## అగ్నిప్రమాదాల నివారణ ఉమ్మడి బాధ్యత

### ఫైర్ సేఫ్టీ దినోత్సవంలో డిజిపి

**విజయవాడ,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** విజయవాడలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గవర్నర్‌పేటలోని ఫైర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఫైర్ డీజీ వెంకట రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా అమరవీరుల స్మృతికి నివాళి అర్పించారు. అగ్నిమాపక పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1944లో ముంబయి డాక్ పేలుడు ఘటన కారణంగా సంస్మరణదినం ఏర్పాటు చేశారన్నారు.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

### రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన.... పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల




ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

## అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

### వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు... తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే
### ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు



**న్యూయార్క్,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్‌-1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్‌-1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. ఇరాన్‌తో చర్చల అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రి పోయేది కాదని అన్నారు. ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కుదరాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే ఈ సంప్రదింపులు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాషింగ్టన్‌-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

## సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు


### అనుమానాలతో గందరగోళం సృషించవద్దు
### రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు

హైదరాబాద్,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ): మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

# వడగాలులు, ఎండలతో జాగ్రత్త

### పిడుగులతో కూడిన వర్షాల సమయంలో ఇంటివద్దనే ఉండాలి... తుఫాన్లు వరదల సమయంలో అంటువ్యాదులతో జాగ్రత్త
### ఇంటి పరిసరాలు అనేవి ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ప్రకృతి విపత్తుల నుండి కాపాడుకోవడానికి సూచనలు తప్పక పాటించాలి.. - రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్

**విజయవాడ, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎండ తీవ్రతకు, వడగాల్పులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణహాని నుండి కాపాడుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని ఆయన చెప్పారు. వడగాల్పుల నుండి రక్షణ కొరకు టోపీ, రుమాలు, తెలుపు రంగు కాటన్ వస్త్రాలను వినియోగించాలన్నారు. కళ్ల రక్షణ నిమిత్తం నాణ్యమైన సన్ గ్లాసెస్ వినియోగించాలన్నారు. ఇంటివాతావరణం చల్లదనం కోసం ఇంటి పై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ వంటి అంశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేడపై మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ భవనాలను చల్లగా ఉంచుతాయని చెప్పారు. మొక్కలు ఉష్ణ తాపాన్ని తగ్గిస్తాయని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచడం ద్వారా వేడి గాలుల నుండి ఉపశమనం లభించి చల్లని వాతావరణం అలముకుంటుందని చెప్పారు. వర్షం పడిన సమయంలో పిడుగుపాటుకు గురి కాకుండా తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో ఇంటిలోనే ఉండాలని ఆయన సూచించారు. ఉరుముల సమయంలో సముద్రము, కొలనులు, చెరువుల దగ్గర ఉంటే వెంటనే దూరంగా వెళ్లాలన్నారు. రేకు లోహము కలిగిన నిర్మాణాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలన్నారు. కారు, బస్సు లోపల ఉన్నవారు వెంటనే అన్ని డోర్స్ మూసివేయాలి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉన్నప్పుడు మెడవెనుక జుట్టు నిక్క బొడవడం లేదా చర్మం జలదరింపు ఉంటె మెరుపు పిడుగు రావడానికి సూచనగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉండి సురక్షిత ప్రదేశాలకు వెళ్లే అవకాశం లేకుంటే రబ్బరు చెప్పులు



ధరించి చెవులు మూసుకుని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలన్నారు. దీనివల్ల ఉరుములు మెరుపులు నుండి రక్షణ పొందవచ్చునని చెప్పారు. ఉరుముల సమయంలో ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిమిషాల వరకూ ఇంట్లోనే ఉండి రక్షణ పొందాలని సూచించారు. పిడుగు బాధితులను తాక వచ్చునని చెప్పారు. సత్వరమే వారికి సహాయం అందించవచ్చునని చెప్పారు. పిడుగు బాధితుని వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ఉరుములు మెరుపులు సంభవించినపుడు చెట్ల క్రింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల దగ్గర ఉండరాదన్నారు. ఎలెక్ట్రిక్రల్, ఎలట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, ఛార్జ్ డ్ ఫోన్స్, మొబైల్ ఫోన్స్ వినియోగించరాదన్నారు. పిడుగులా సమయంలో స్నానం చేయడం, చేతులు కడగడం, నీటిలో ఉండడం లాంటివి చేయరాదన్నారు. మోటారు సైకిళ్ళు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వ్రేలాడుతున్న విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. వాహనంలో ఉండి ఉంటే లోహపు భాగాలను తాకరాదన్నారు. ఎండ తీవ్రత నుండి కాపాడుకోవడానికి గాను వీలైనంత వరకూ ఇంట్లో ఉండాలి. తరుచూ నీటిని త్రాగుతూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని త్రాగాలి. తరుచూ వాతావరణం సమాచారం తేలుకుంటూ ఉండాలి అందులకు గాను న్యూస్ అనేది వాచ్ చేయాలి. ఎండలో నుండి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తీసుకోవాలి. ఎండలో బయటకు వచ్చినపుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుని సంప్రదించాలన్నారు. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. ఫ్యాన్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేయాలి. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. నలుపురంగు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. ఎండ సమయంలో శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. బాలింతలు, వృద్దులు, చిన్నపిల్లలు ఎండ సమయంలో బయట సంచరించరాదు. వీరిపై ఎండ ప్రభావం కనపడే అవకాశం ఉంటుంది. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోరాదు. ప్రకాశించే బల్బులను వినియోగించడం మానుకోవాలి. అవి అనవసరపు వేడిని విడుదల చేస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు. తుఫాన్, వరదల సమయంలో టెలివిజన్ రేడియో ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే ప్రమాద స్థలం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి. తుఫాన్ వరదల సమయంలో ముందుగానే విలువైన వస్తువులు, పత్రాలు, నగదుతో సురక్షిత ప్రదేశంలో తలదాచుకోవాలి. సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వ సూచనలు అందుకున్న పిమ్మట మాత్రమే ఇళ్లకు తిరిగి వెళ్లాలన్నారు. తుఫాన్ లు వరదల తర్వాత అంటువ్యాదులు నిరోధించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ లు, వరదల సమయంలో కాల్వలకు వంతెనలకు అడ్డుపడిన చెత్తను తొలిగించాలి. సముద్ర నదీతీర ప్రాంతాలకు వెళ్ళరాదు. చేపల వేటను మానుకోవాలి. నదులు దాటే ప్రయత్నం చేయరాదు. పాడుపడిన ఇళ్ళు చెత్తా చెదారం నుండి దూరంగా ఉండాలి. విద్యుత్ పరికరాలను వినియోగించరాదు. వరద నీటి ద్వారా వచ్చే విష జ్వరాల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి. అంటువ్యాదులు వ్యాపించకుండా వరదనీరు కలుషిత నీరు నుండి దూరంగా ఉండాలి. ఇళ్లకు ఉన్న పగుళ్ళను పరిశీలించి తదుపరి లోపలకు వెళ్ళాలి. ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణములు ఆఫ్ చేయాలి. తడిచిన విద్యుత్ వస్తువులు తాకరాదు. ప్రకృతి విపత్తులు అయిన ఎండలు, వడగాలులు, తుఫాన్ లు, వరదలు, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు సమయంలో అత్యంత జాగరూకత వహించాలని ఆయా సమయాల్లో విపత్తుల నిర్వహణ సంస్థ వారు జారీ చేసిన రక్షణ చర్యలను పాటించాలని అప్పుడు ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చునని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేసారు.

# భారీ స్ప్రేయర్.. 10 గంటల్లో 100 ఎకరాలు పూర్తి.. పెట్రోలు ఖర్చు రూ. 300 లోపే



- చక చకా పిచికారీ!
- గంటకు పదెకరాల్లో పిచికారీ చేసే భారీ స్ప్రేయర్
- పది గంటల్లో వందెకరాలు పూర్తి.. పెట్రోలు ఖర్చు రూ. 300 లోపే
- ఆవిష్కరించిన అమృతలూరు రైతు రామకృష్ణ
- రైతును మించిన శాస్త్రవేత్త లేడంటారు

వినూత్న ఆలోచనలకు, ఆవిష్కరణలకు చదువుతో పనిలేదు. అవసరమే అన్నీ నేర్పిస్తుంది. గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గంలోని మండల కేంద్రం అమృతలూరు రైతు మల్లెపెద్ది రామకృష్ణ ఇందుకో నిదర్శనం. ఇంటర్ చదువుకొని వ్యవసాయంలో స్థిరపడ్డారు. పురుగుమందు పిచికారీలో సమయాన్ని, ఖర్చును ఆదా చేసే ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్‌ను సొంత ఆలోచనతో పెద్ద రైతుగా తన అవసరాల మేరకు తయారు చేసుకొని వాడుతున్నారు. ఈ ఆవిష్కరణతో గంటకు 10 ఎకరాల చొప్పున, కేవలం 10 గంటల్లో తన వందెకరాల పైరుకు మందు పిచికారీని పూర్తి చేస్తుండటం విశేషం. మాగాణి భూమిలో ఖరీఫ్‌లో వరి తర్వాత రెండో పంటగా వంద ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు రామకృష్ణ. ఈ పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ. సాధారణ పవర్ స్ప్రేయర్‌తో ముగ్గురు, నలుగురితో మందు పిచికారీ చేయించినా, కనీసం అయిదు రోజులు వ్యవధి పట్టేది. స్ప్రేయింగ్ చేయటానికి, ట్యాంకుల్లో నీళ్ల కలిపే వారితో సహా కూలీ ఖర్చులు హీనపక్షం రూ.లక్ష తప్పనిసరి. మరూకా పురుగు ఆశిస్తే వెంటనే చేను మొత్తం పిచికారీ చేయాలి. ఇక్కడ ఒకవైపు నుంచి రెండోవైపునకు పని పూర్తి చేసే సరికి కొన్ని రోజులు పట్టేది. ఆలోగా ఆవైపు చేనును పురుగు తినేసేది. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఏమిటా అనే మథనంలోంచి పెద్ద రైతులకు ఉపయోగపడే ఈ వినూత్నమైన భారీ మౌంటెడ్ స్ప్రేయర్ పుట్టుకొచ్చింది. 1800 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ భారీ స్ప్రేయర్‌తో గంటకు పదెకరాల్లో పురుగుమందును ప్రస్తుత రబీలోనే తొలిసారి పిచికారీ చేస్తున్నారు రామకృష్ణ. ఆవిధంగా వందెకరాల పొలంలో 10 గంటల్లోనే పిచికారీ పూర్తిచేస్తున్నారు. ఎటొచ్చినా 50 అడుగుల దూరంలో వానజల్లులా మొక్క మొత్తం పూర్తిగా తడుపుతున్నారు. పదెకరాలకు 1800 లీటర్ల చొప్పున వందెకరాలకు 18 వేల లీటర్ల నీటి పిచికారీతో పనిలో పనిగా.. పొలానికి అవసరమైన నీటితడి కూడా సమకూరుతోంది. ఇప్పుడా వందెకరాల్లోని మినుము పైరు కేవలం 45 రోజుల వయసులోనే ఏపుగా పెరిగి భారీ దిగుబడులకు భరోసానిస్తోంది. సేంద్రియ/ప్రకృతి వ్యవసాయం చేసే పెద్ద రైతులక్కూడా ఈ భారీ స్ప్రేయర్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

### 2.5 లీ. పెట్రోలుతో వందెకరాల్లో పిచికారీ

ట్రాక్టరుకు వెనుక వైపు 650 లీటర్ల చొప్పున సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకులు ఒకదానిపై ఒకటి బిగించారు. ముందుభాగంలో 500 లీటర్ల సింటెక్స్ ట్యాంకును అమర్చారు. అంటే మొత్తం 1800 లీటర్లు. 5 హెచ్‌పీ మోటారు, మరో వైపర్ మోటారును బిగించారు. వీటన్నిటినీ ట్యాంకులకు అనుసంధానం చేశారు. మోటారు ఆన్ చేయగానే వైపర్ మోటారు తిరుగుతుంది. వెనుకభాగంలో రెండువైపులా గల వైపర్స్ తిరుగుతూ వీటి చివర గల నాజిల్స్‌లోంచి మందు పిచికారీ అవుతుంది. ట్రాక్టరు తిరిగేందుకు అనువుగా విత్తనాలు చల్లేటపుడే దారులు సిద్ధం చేసుకున్నారు. ఈ భారీ స్ప్రేయర్‌కు కావాల్సిన ఒక్కో పరికరాన్ని ఒక్కోచోట నుంచి సమకూర్చుకున్నట్టు రామకృష్ణ చెప్పారు. ఇందుకు రూ.1.50 లక్షల ఖర్చయ్యిందన్నారు. మోటార్లకు కావాల్సిన పెట్రోలు ట్యాంకులో సామర్థ్యం ముప్పాతిక లీటరు మాత్రమే. కేవలం రెండున్నర లీటర్ల పెట్రోలుతో వంద ఎకరాల్లో మందు పిచికారీకి సరిపోతోంది. అంటే ప్రెటోలు ఖర్చు రూ.300 లోపే. ఈ రకంగా రామకృష్ణ వినూత్న ఆవిష్కరణతో తన సమస్యను అధిగమించటమే కాకుండా, తన స్ప్రేయర్‌ను తోటి రైతులకూ అద్దెకు ఇస్తూ వారి ఖర్చునూ తగ్గిస్తున్నారు రామకృష్ణ (99595 95060).

# కొలెస్ట్రాల్ అదుపులో ఉండాలంటే.. ఈ 5 ఫుడ్స్ తినాల్సిందే..!



కొలెస్ట్రాల్ నేరుగా గుండె ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. కొలెస్ట్రాల్ అని పిలువబడే రక్త నాళాలలో ఉండే మైనపు లాంటి పదార్థం రెండు లిపోప్రొటీన్ల ద్వారా రక్త ప్రవాహాలలో ప్రయాణిస్తుంది. ఒకటి తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్, దీనిని చెడు కొలెస్ట్రాల్ అని కూడా పిలుస్తారు. మరొకటి అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్, దీనిని మంచి కొలెస్ట్రాల్‌గా సూచిస్తారు. హెచ్‌డిఎల్ కాలేయం ద్వారా శరీరం నుండి కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. ఎల్‌డిఎల్ రక్త నాళాలలో కొవ్వును పెంచుతుంది. ఇది వాటిని అడ్డుకుంటుంది. గుండెపై ఒత్తిడిని సృష్టిస్తుంది. ఫలితంగా స్ట్రోకులు గుండెపోటు వస్తుంది. అందువల్ల, శరీరంలో ఎల్‌డిఎల్ స్థాయిని తగ్గించడం మరియు హెచ్‌డిఎల్ విలువను పెంచడం చాలా ముఖ్యం. ఆపిల్: యాపిల్‌లో డైటరీ ఫైబర్ మరియు పాలీఫెనాల్ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రోజుకు కనీసం రెండు యాపిల్స్ తినడం రక్తంలో ఎల్‌డిఎల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుందని నిరూపించబడింది. తృణధాన్యాలు: తృణధాన్యాలు ప్రత్యేకంగా, ఓట్స్ మరియు బార్లీ, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారికి ఉత్తమ ఆహారంగా చెప్పబడింది. వాటిలో బీటా-గ్లూకాన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే ఒక రకమైన కరిగే ఫైబర్. అవి విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. మొత్తం గుండె ఆరోగ్యానికి మంచిది. గింజలు: అసంతృప్త కొవ్వుల యొక్క గొప్ప మూలం, ఇది ఆహారంలో సంతృప్త కొవ్వులను తొలగించడంలో సహాయపడుతుంది. గింజలు మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహించడానికి మరియు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి తగిన కరిగే ఫైబర్‌లో కూడా పుష్కలంగా ఉన్నాయని చెబుతారు. వెల్లుల్లి:మనం రక్తపోటు గురించి మాట్లాడినప్పుడల్లా, ఎల్లప్పుడూ జాబితా చేసే ఒక ఆహారం వెల్లుల్లి. గుండె ఆరోగ్యానికి వెల్లుల్లి నిజంగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ మరియు ఇతర మొక్కల సమ్మేళనాలు %ాణూ% కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అత్యంత ప్రభావవంతమైనవి. సోయా:సోయాలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. తక్కువ కొలెస్ట్రాల్ ఆహారంలో చేర్చాలి. సోయాను టోఫు, సోయా మిల్క్ వంటి వాటి రూపంలో తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్‌ను మూడు నుంచి నాలుగు శాతం నియంత్రించడంలో సహాయపడుతుందని అధ్యయనాలు రుజువు చేశాయి.

# కీళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, మోకాళ్ళ నొప్పులను తగ్గించే ఆహారాలు..!!

ఇక ఈ మధ్య కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా మనలో చాలా మందికి కూడా కాల్షియం లోపం కారణంగా కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు ఇంకా అలాగే నడుము నొప్పి వంటి సమస్యలతో తెగ బాధపడుతున్నారు.ఇక ఈ సమస్యల నుంచి బయట పడాలంటే కొన్ని ఆహారాలను తప్పనిసరిగా తీసుకోవడం చాలా మంచిది..చాలా మంది కూడా ఇలాంటి నొప్పులు రాగానే పెయిన్ కిల్లర్స్ వాడేస్తూ ఉంటారు.కాని పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడటం అనేది అంత మంచిది కాదు.ఇక అలా కాకుండా కాల్షియం సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకుంటూ ఉంటే నొప్పుల నుండి వారికి సహజంగా ఉపశమనం కలుగుతుంది.

ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడేవారు ఇలాంటి ఆహారాలను తప్పనిసరిగా తీసుకోవడం వారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇక కీళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, మోకాళ్ళ నొప్పులను తగ్గించే ఆహారాలు.. ఆకుపచ్చని ఆకుకూరల్లో ఇంకా అలాగే కూరగాయల్లోనూ కాల్షియం అనేది చాలా సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి వారంలో మూడు రోజులు ఆకుకూరలు తీసుకోవడం చాలా మంచిది.

అలాగే ప్రతి రోజు కూడా ఒక గ్లాస్ పాలను తీసుకుంటే చాలా మంచిది.డ్రై ఫ్రూట్స్ లో కూడా కాల్షియం అనేది చాలా సమృద్ధిగా ఉంటుంది. డాక్టర్స్ కూడా డ్రై ఫ్రూట్స్ తినమని అందరికి సిఫార్స్ చేస్తున్నారు.

డ్రై ఫ్రూట్స్ వలన ఎన్నో పోషకాలు అందటమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. ఆరెంజ్ ఇంకా కమలలో విటమిన్-సి అలాగే కాల్షియం అనేది ఉంటుంది. ఒక కప్పు (200 గ్రాములు) ఒలిచిన నారింజ ఇంకా కమలలో 72.2 మి.గ్రా కాల్షియం ఉంటుంది.బీన్స్ పప్పు ధాన్యలులో క్యాల్షియం చాలా పుష్కలంగా ఉంటుంది. అలాగే వీటిలో కాల్షియంతో పాటు ప్రోటీన్, ఐరన్, జింక్, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియం ఇంకా అలాగే ఫైబర్ ఉంటుంది. ఇటువంటి ఆహారాలను తప్పనిసరిగా మీరు తీసుకునే ఆహారంలో బాగంగా చేసుకోవాలి.



# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు

**ముఠా గుట్టురట్టుచేసిన పోలీసులు**

**హైదరాబాద్,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు . ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. ఎటువంటి అనుమతులు లేకుండా ఓవర్సీస్ కన్‌స్టలెన్సీలను నడుపుతూ గ్రీస్, రుమేనియా దేశాల్లో ఉద్యోగాల పేరుతో లక్షలు దండుకుంటున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ట్రివియల్ చాప్టర్ సంస్థకు చెందిన నిరుపమ, అరుణ్ రాజ్ లను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రీస్, రొమేనియా ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి రూ.50 వేల నుంచి రూ4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. బాధితులను నమ్మించేందుకు నకిలీ వర్క్ ఆథరైజేషన్ లెటర్ ఇస్తూ మోసం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండానే ఓవర్సీస్ కన్‌స్టలెన్సీ నడుపుతున్న ఈ ముఠా.. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ఈ కేసులో మరో 8మంది నిందితులకోసం గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు. ఇప్పటికే కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఈ ముఠాపై పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. విదేశాల్లో ఉద్యోగ ఆఫర్లు నకిలీవో, ఒరిజినల్ వో పోర్టల్‌లో ఏజెంట్ల వివరాలు చెక్ చేసుకోవాలని నిరుద్యోగులకు పోలీసులు సూచిస్తున్నారు.

## అక్రమ గ్రానైట్ దందాపై కొరడా.... రవాణా చేస్తున్న పలు వాహనాల సీజ్

**కరీంనగర్,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** కరీంనగర్ జిల్లాలో అక్రమ మైనింగ్ పై పోలీసులు కొరడా ఝులిపించారు. అక్రమంగా గ్రానైట్ రవాణ చేస్తున్న పలు వాహనాలను సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించారు. అక్రమ గ్రానైట్ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న ఆరోపణల క్రమంలో తనిఖీలు చేపట్టారు పోలీసులు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోన పలు గ్రానైట్ తరలిస్తున్న లారీలను ఆపి చెక్ చేశారు పోలీసులు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. వారంరోజుల్లో 20 వాహనాలను సీజ్ చేశారు. వాహనాల ఓవర్ లోడ్, అనుమతులు లేకుండా రవాణా, జీఎస్టీ చెల్లించని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు సీజ్ చేయడంతో పోలీస్ స్టేషన్ కు క్యూకట్టారు గ్రానైన్ వ్యాపారులు. అక్రమంగా జరుగుతున్న గ్రానైట్ రవాణాపై మైనింగ శాఖ చూసి చూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్న క్రమంలో కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. విదేశాలకు ఎగుమతి చేస్తున్న గ్రానైట్ పై నిఘా పెట్టారు.

## ప్రాణం తీసిన చెరువులో షికారు సరదా... ఈతరాక ఒక యువకుడు దుర్మరణం

**యాదాద్రి,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని గౌస్ కొండ గ్రామ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరదాగా షికారుకు వెళ్లిన యువకుల బృందంలో ఒకరు నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. ఆరుగురు యువకులు కలిసి గౌస్ కొండ గ్రామ సమీపంలోని చెరువు సమీపంలో సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. ఒక బుట్ట పడవ సహాయంతో నీటిలోకి షికారుకు వెళ్లారు. అయితే, నీటి మధ్యలోకి వెళ్లిన తర్వాత ఊహించని విధంగా పడవ బోల్తా పడింది. పడవ బోల్తా పడటంతో అందులోని ఆరుగురు యువకులు నీటిలో పడిపోయారు. వారిలో ఐదుగురు యువకులు ఈత కొట్టుకుంటూ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. అయితే, పాండాల శివకుమార్ గౌడ్ అనే యువకుడు మాత్రం నీటి ఉధృతికి లేదా లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక గల్లంతయ్యాడు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన శివకుమార్ గౌడ్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో గౌస్ కొండ గ్రామంలో, యువకుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా వెళ్లిన విహారయాత్ర ఇలా ప్రాణాల మీదకు తీసుకురావడంతో తోటి మిత్రులు దిగ్భ్రాం÷-రతికి లోనయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# ప్రత్యేక అవసరాల విద్యార్థులకు శిక్షణ

**ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్ర... ప్రారంభించిన మంత్రి లోకేశ్**

**అమరావతి,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు, వారిలోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల బృందం ఎవరెస్ట్ అధిరోహణకు వెళ్లడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారని నారా లోకేశ్ తెలిపారు. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏటా ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి, వారిని అన్నివిధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సమగ్ర శిక్షా విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఈ సాహస యాత్రకు సిద్ధం చేశామని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ వారిలో స్ఫూర్తిని నింపారు. శారీరక వైకల్యం అనేది ఓ సవాలు మాత్రమేనని, మనసులో కసి, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడం ద్వారా ఈ విద్యార్థులు ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కేవలం ఒకసారి గుర్తించి వదిలేయడం కాకుండా, వారిని నిరంతరం ప్రోత్సహించే వ్యవస్థను నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం విద్యాశాఖ మరిన్ని సాహసోపేతమైన కార్యక్రమాలను రూపొందిస్తుందని తెలిపారు. ఈ బృందం నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహించడానికి బయలుదేరడం ఏపీకే గర్వకారణమని, వీరు తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని వెల్లడించారు. సాధారణంగా ఇలాంటి సాహస యాత్రలు క్రీడాకారులు లేదా అనుభవం ఉన్నవారు చేస్తారని కానీ, సమగ్రశిక్ష విభాగం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేయడం విశేషమని తెలిపారు. ఇది విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచుతుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం నిరూపిస్తోందని తెలిపారు. ఎవరెస్ట్ యాత్రకు వెళ్తున్న విద్యార్థుల బృందానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.



## ఉస్మానియాలో అక్రమాలు

**విచారణ జరపాలన్న ఎమ్మెల్యే రాజాసింగ్**

**హైదరాబాద్,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ):** ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య మంత్రికి లేఖ రాశానని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. చెన్నైకు చెందిన ప్రైవేట్ సంస్థకు ఆసుపత్రిలో శుభ్రత బాధ్యత అప్పగించారని వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం, ప్రభుత్వం ప్రతి నెలా సుమారు 787 మంది కార్మికులకు చెల్లింపులు చేస్తోందని, వాస్తవంగా విధుల్లో ఉన్న కార్మికులు 400 మందేనని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రతి కార్మికుడికీ నెలకు సుమారు 11,400 చెల్లిస్తున్నారని, వాస్తవంగా పనిచేసే కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో, ప్రతి నెల లక్షల రూపాయలు దుర్వినియోగం అవుతున్న అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలు మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని విమర్శించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

**వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలుడు... 10 మంది కార్మికులు మృత్యువాత**

**రాయపూర్,ఏప్రిల్14(ఆర్ఎన్ఎ):** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సక్తి జిల్లాలోని వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలడంతో 10 మంది కార్మికులు మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ ఘటన అకస్మాత్తుగా బాయిలర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సంఘటన సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలన కొనసాగుతోంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం మరోసారి పారిశ్రామిక భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. భారీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్:** వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, గుడిపేట పోలీస్ బెటాలియన్ అడ్మిన్ వెంకటరాములు, జిల్లా రవాణా అధికారి గోపికృష్ణ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల



చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బ్రీత్ ఎనలైజర్స్, స్పీడ్ గన్స్ అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిఆర్ హైస్కూల్‌లో 'ప్రజా పాలన' అవగాహన సదస్సు

**విద్యార్థులకు కీలక సూచనలు చేసిన ఎస్ఐ బండి మోహన్**

**హుజూర్ నగర్ ఏప్రిల్ 15 నేటి మనదేశమ్::** ప్రభుత్వం



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు హుజూర్ నగర్ లోని ఎండిఆర్ హైస్కూల్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూర్ నగర్ టౌన్ ఎస్ఐ బండి మోహన్ ముఖ్య అతిథిగా హాజరై,ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు సోషల్ మీడియా వాడకం విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. నేటి కాలంలో సాంకేతికత ఎంత ఉపయోగకరమో, అంతకంటే ఎక్కువ ప్రమాదకరంగా మారుతోందని, అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాల్లో పరిచయాలు పెంచుకోవడం వల్ల సైబర్ నేరాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని చదువుకే కేటాయించాలని,సోషల్ మీడియాకు బానిసలై భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. అలాగే,సమాజాన్ని పట్టి పీడిస్తున్న"డ్రగ్స్ మరియు గంజాయి"వంటి వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను ఎస్ఐ వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి,ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రయాణాల్లో రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రాణ రక్షణకు ఎంతో ముఖ్యమని,మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేరెడ్డి దామోదర్ రెడ్డి,ఏఓ పింగిలి నర్సిరెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖ వారు పాఠశాలకు విచ్చేసి విద్యార్థులకు ఇలాంటి సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది,పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ...

**- జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన**



**నిర్మల్ , ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కొమురయ్యకు 'దళితరత్న' పురస్కారం



**ములుగు,ఏప్రిల్ 15(నేటిమనదేశమ్ ప్రతినిధి)** ములుగు జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఎనగందుల కొమురయ్య కు 'దళిత రత్న' అవార్డు లభించింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం,హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ద్వారా ములుగు డివిజన్ అధ్యక్షుడిగా 2016లో కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షుడిగా, 2017లో నూతన జిల్లాగా ఏర్పడిన ములుగు జిల్లా అధ్యక్షుడిగా దళితులు,అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తించి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి 2026 హైదరాబాదులోని రవీంద్ర భారతిలో మంగళవారం జయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కో చైర్మన్ లు దొమ్మాటి సుదర్శన్ బాబు, అల్లిబిల్లి మహేందర్ ల చేతిలో మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దుర్మార్టి సుదర్శన్ బాబు ఈ గౌరవాన్ని కల్పించారు. తన చేసిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ నాయకులు సీనపల్లి కొమరయ్య, మనోహర్, రాష్ట్ర నాయకులు ఎర్ర చంద్రమౌళి లకు అవార్డు గ్రహీత ఎనగందుల కొమురయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు.

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు, ఏప్రిల్ 15(నేటిమనదేశమ్ ప్రతినిధి)** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న మండల కేంద్రాలు, మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, ముఖ్యమంత్రి సందేశం అందరికీ వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు,జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, నీటి పారుదల శాఖ ఈఈలు, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ పీడీ, జిల్లా ఉద్యానవన అధికారి, సి.పి.ఓ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈఈ, డి.పి.ఓ. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## అధిక ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.**

**వృద్ధులు, చిన్నపిల్లల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, ఏప్రిల్:15(నేటిమనదేశమ్ ప్రతినిధి)** జిల్లాలో అధిక ఉష్ణోగ్రత నమోదు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల మధ్యలో ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకూడదని అన్నారు. అధికఉష్ణోగ్రతలో ,ప్రయాణాలు చేసినప్పుడు, పనుల నిమిత్తం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లినప్పుడు అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల గుండె కొట్టుకోవడం, పల్స్ పెరగడం, ఊపిరితిత్తులు వేగంగా హెచ్చుతగ్గులతో కొట్టుకోవడం, లవణాలు, ఆక్సిజన్ మెదడుకు అందక పోవడం మూలంగా, మెదడు నరాలపై ప్రభావాన్ని చూపి, పిట్స్ , మూర్ఛ రావడం స్పృహ కోల్పోవడం, కోమాల్లోకి వెళ్లడం, అధిక జరం ,తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం ఒళ్ళు నొప్పులు రావడం లాంటివి సంభవించే అవకాశం ఉంటుందని,ఎండ ఎక్కువగా ఉన్న సమయాలలో తప్పనిసరిగా గొడుగు, కొంగువాలు, టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ఉపయోగించుకునేలా చూసుకోవాలని,త్రాగునీరు, నిమ్మరసం, కొబ్బరి నీళ్ళు వంటివి కూడా సేవించాలని అన్నారు. పలచటి మజ్జిగ, గ్లూకోజ్ నీరు మరియు చిటికెడు ఉప్పు, చెంచా చక్కెర ఒక గ్లాసు నీటిలో కలుపుకొని ఇంట్లోనే తయారు చేయబడిన ఓ.ఆర్.ఎస్. ద్రావణం త్రాగించినట్లయితే వడదెబ్బ నుండి త్వరగా ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచేలా చూడాలని, శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది కనుక సాధారణ ఉష్ణోగ్రత వచ్చే వరకు తడి గుడ్డతో తుడుస్తూ ఉండాలని, వడదెబ్బకు గురి అయిన వారు ప్రాథమిక చికిత్స అనంతరం సాధారణ స్థితికి రాకుంటే, శరీరంలో అధిక ఉష్ణోగ్రత నమోదై చెమట పట్టకపోవడం వాంతులు స్పృహ కోల్పోవడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యముతో ఉన్న వారు, వడ గాలులకు గురి కాకుండా కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.

**వడదెబ్బ జాగ్రత్తలపై టామ్ టామ్,** మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రచారం చేయాలని, గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కూడలిలో వడదెబ్బ తగలకుండా ఉండే జాగ్రత్తలను వివరించినట్లు వంటి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆశా వర్కర్లు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో తగిన పరిమాణంలో ూూ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకునే విధంగా చూసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ సరిహద్దులో, ఎవెన్యూ ప్లాంటేషన్ మరియు రోడ్ల వెంబడి నాటిన మొక్కలు రోజుకు రెండు సార్లు పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలని, పశువులకు మరియు జంతువులకు ఎండ, వేడి నుండి కాపాడుటకు తగు జాగ్రత్తలు తీసుకొనవలెను. వీటికి నీరు త్రాగుటకు తగిన సదుపాయాలు కల్పించాలని అన్నారు. వేసవి కాలం దృష్ట్యా స్థానిక ప్రజలకు అన్ని గ్రామపంచాయతీలలో మండల కార్యాలయాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.

## విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై సమాజంలో చైతన్యం కలిగించాలి..

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ , ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అరైవ్ అలైవ్ వారోత్సవాలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం పట్టణంలో జయశంకర్ చౌరస్తా సమీపంలో విద్యార్థులచే భారీ మానవహారం నిర్వహించారు. ఈ మానవహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాలు తమ పాటల ద్వారా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.., విద్యార్థి దశ నుంచి పిల్లలందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగించేలా సంబంధిత అధికారులతో కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులే రోడ్డు భద్రత నియమాలపై ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ లు అని, పిల్లలు మంచి విషయాలు చెబితే ప్రతి ఒక్కరు తప్పకుండా వింటారని అన్నారు. విద్యార్థులు తమ ఇండ్లలో తల్లిదండ్రులకు, సమాజంలోని వ్యక్తులకు ట్రాఫిక్ నియమాల గురించి చైతన్యం కలిగించాలన్నారు. తమ కుటుంబ సభ్యులు వాహనాలలో బయటకు వెళ్ళునప్పుడు, హెల్మెట్, సీట్ బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం వంటి రోడ్డు భద్రత విషయాలపై వివరించాలని తెలిపారు. విద్యార్థులు ఎవరు తగిన వయస్సు లేనిదే వాహనాలను నడుపరాదని సూచించారు. పలువురు విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగించేలా ఉపన్యాసాలు ఇచ్చారు. కలెక్టర్, అధికారులు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ మానవహారం లో సీపీఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంవిఐ మహేందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్ సి సి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ములవాగు ఇసుక రీచ్‌పై ఆకస్మిక తనిఖీ

**- అక్రమ రవాణాపై కఠిన చర్యలు - డీఎస్పీ శ్రీనివాసులు**




**వేములవాడ, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ములవాగు ఇసుక రీచ్‌ను డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్‌తో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో ఇసుక తవ్వకాల విధానం, రవాణా అనుమతులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా జరగాలని అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం, అనధికార నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఇసుక రవాణాలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు.

## ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి..

**- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



**నిర్మల్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి ):** జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం, తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1035 మంది పదవ తరగతి, 821 ఇంటర్, మొత్తం కలిపి 1856 మంది విద్యార్థులు, 5 ఎస్ ఎస్ సి, 4 ఇంటర్, మొత్తం 9 పరీక్ష కేంద్రాలలో ఓపెన్ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేలా తగిన ఫర్నిచర్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, తదితర వసతులు ఉండాలన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో కూడిన అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ భోజన్న, డిఐఈఓ పరుశురాం, తపాలా శాఖ ఇన్స్ పెక్టర్, ఎసిజిఈ పరమేశ్వర్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు రమేష్, సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓజీ-2 పనిలో సుజీత్?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాక, ఆయన చేసిన చిత్రాల్లో అభిమానులను అత్యంత అలరించింది ఓజీనే. సినిమా అనౌన్స్ అయిన దగ్గర్నుంచే బంపర్ క్రేజ్ తెచ్చుకున్న ఈ సినిమా.. తర్వాత ప్రతి ప్రోమోతో ఆకట్టుకుంది. గత ఏడాది సెప్టెంబరులో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా.. పవన్ కెరీర్లోనే హైయెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. అభిమానులు సినిమా నుంచి ఇంకా ఎక్కువే ఆశించారు కానీ.. పవన్ చేసిన మిగతా చిత్రాలతో పోలిస్తే ఇది సూపర్ అనడంలో మరో మాట లేదు. ప్రస్తుతం పవన్ సురేందర్ రెడ్డితో సినిమాను ఓకే చేయగా.. దాని కంటే ఓజీ సీక్వెల్ మీదే వారికి ఎక్కువ ఆశలు, అంచనాలు ఉన్నాయి. ఓజీ-2 విషయంలో ఇటు సుజీత్, అటు పవన్ ఇద్దరూ ఆసక్తితోనే ఉన్నారు కానీ.. అది ఎప్పుడు ఉంటుందనే విషయంలో ఏ క్లారిటీ లేదు. ఐతే ఇటీవల దీని గురించి జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఓజీకి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ చేయాలని సుజీత్ అనుకుంటున్నాడని.. ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. పీపుల్ మీడియా సంస్థ, పవన్ సొంత ప్రొడక్షన్ హౌస్ పీకే క్రియేటివ్ వర్క్స్ కలిసి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తాయని తెలుస్తోంది. ఐతే ఈ సినిమా ఎప్పుడు ఉంటుందనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ఓజీ తర్వాత సుజీత్.. నానితో బ్లడీ రోమియో సినిమాను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఈపాటికే మొదలు కావాల్సింది. కానీ ప్యారడైజ్ సినిమా అనుకున్న దాని కంటే ఆలస్యం అవుతుండడంతో నాని ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సమ్మర్ షూటింగ్ అంచనాతో బ్లడీ రోమియో స్క్రిప్టును సుజీత్ ఇప్పటికే పూర్తి చేశాడు. ప్రస్తుతం అతను ఖాళీగా ఉన్నాడు. ఈ సమయాన్ని ఓజీ-2 కోసం వెచ్చిస్తున్నాడట సుజీత్. అభిమానుల అంచనాలను అందుకునేలా ఈ స్క్రిప్టును తీర్చిదిద్దే ప్రయత్నంలో అతను ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి కథ ఎక్కువగా జపాన్ నేపథ్యంలోనే నడుస్తుందని.. సినిమాలో మిస్ అయిన టైం లైన్‌ను ఇందులో చూపిస్తారని అంటున్నారు. సురేందర్ రెడ్డి చిత్రాన్ని పూర్తి చేశాక వచ్చే ఏడాది ఈ సినిమాను పవన్ మొదలుపెట్టే అవకాశముంది.

# దురంధర్ పోవాలని కోరుకున్న టాప్ డైరెక్టర్లు



ఒక భాష నుంచి ఆల్ టైమ్ హిట్ వస్తే.. ఆ ఇండస్ట్రీ అందుకు ఎంతో గర్విస్తుంది. ఆ సినిమా మాది అని గర్వంగా చెప్పుకుంటుంది. 'బాహుబలి' పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ టాలీవుడ్ అలాగే గర్వించింది. 'కేజీఎఫ్' సినిమా సంచలనం రేపినపుడు శాండిల్‌వుడ్ కూడా అంతే ప్రౌడ్ ఫీలైంది. కానీ 'దురంధర్', 'దురంధర్-2' చిత్రాల విషయంలో మాత్రం బాలీవుడ్‌లో అలాంటి ఫీలింగ్ కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. నాలుగు నెలల ముందు 'దురంధర్' ఎంతటి సంచలనం రేపిందో తెలిసిందే. గత నెలలో విడుదలైన 'దురంధర్-2' అంతకుమించి విజయం సాధించింది. తాజాగా ఈ చిత్రం బాహుబలి, పుష్ప-2 చిత్రాలను అధిగమించి ఆల్ టైం ఇండియన్ టాప్-2 గ్రాసర్‌గా నిలిచింది. అయినా బాలీవుడ్ నుంచి ఆ చిత్రాన్ని అభినందిస్తూ బాలీవుడ్ ప్రముఖులు పోస్టులు పెట్టట్లేదు. ఇది కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారుకు అనుకూలంగా తీశారు అనే ఒక ముద్ర వేసి బాలీవుడ్ ఆ సినిమాకు దూరంగా జరుగుతోందనే అభిప్రాయం కలుగుతోంది. ఇలాంటి సమయంలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుల్లో ఒకరైన కునాల్ కోహ్లి.. 'దురంధర్' విషయంలో బాలీవుడ్ అగ్ర దర్శకుల కడుపు మంట ఎలా ఉందో బయటపెట్టారు. 'దురంధర్', 'దురంధర్-2' సినిమాలు సాధించిన విజయానికి గర్వించకపోగా.. ఆ సినిమా ఫ్లాప్ కావాలని బాలీవుడ్ టాప్ డైరెక్టర్లు కోరుకున్నట్లు ఆమిర్ ఖాన్‌తో 'ఫనా' సినిమా తీసిన కునాల్ వెల్లడించాడు. ఇండస్ట్రీలో ఎవ్వరూ 'దురంధర్' సినిమాకు మద్దతుగా నిలవలేదని.. అయినా ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయిందని వ్యాఖ్యానించాడు కునాల్. తాను కొంతమంది అగ్ర దర్శకులతో మాట్లాడానని.. వాళ్లు సోమవారానికి ఈ సినిమా పనైపోతుందని అన్నారని, కానీ ఆ సినిమా సోమవారం పడిపోకుండా బాగా ఆడిందని అన్నాడు. సన్నీ డియోల్ సినిమా 'బోర్డర్-2' సినిమా కూడా ఫ్లాప్ కావాలని చాలామంది కోరుకున్నారని.. కానీ ఆ చిత్రం రూ.300 కోట్ల వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ అయిందని చెప్పాడు. దీన్ని బట్టి తాను చెప్పదలుచుకున్నది ఒక్కటే అని.. ఇండస్ట్రీ సపోర్ట్ చేసినా చేయకపోయినా పెద్ద విషయం కాదని.. సినిమాలు ఆడతాయని అతనన్నాడు.




## నమ్మొచ్చా... టైటిల్ కోసం 112 కోట్లు



ఇటీవలే విడుదలైన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ తమిళంలో ఓ మోస్తరుగా, తెలుగులో నీరసంగా రన్ అవుతోంది. ఫైనల్ గా ప్రదీప్ రంగనాథన్ ఖాతాలో తొలి ఫ్లాప్ నమోదు కావడం ఖాయమని బయ్యర్లు చెబుతున్నారు. వరసగా మూడు వంద కోట్ల గ్రాసర్లు ఇచ్చి మరోసారి ఆ ఫీట్ చేస్తాడనుకుంటే ఆ ఛాన్స్ మిస్ కావడంతో ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. అయితే పోస్ట్ ప్రమోషన్ల కోసం దర్శకుడు విగ్నేష్ శివం చెబుతున్న మాటలు కొన్ని ఆశ్చర్యకరంగా, షాక్ ఇచ్చేలా ఉన్నాయి. ఈ సినిమా ముందు రాజ్ కమల్ బ్యానర్ మీద కమల్ హాసన్ నిర్మించేందుకు రెడీ అయ్యారు. కానీ పది నెలలు ప్రాజెక్టులో ఎలాంటి కదలిక లేదు. తర్వాత సెవెన్ స్క్రీన్స్ సంస్థ ముందుకొచ్చింది. తొలుత రెండు వందల కోట్ల బడ్జెట్ అనుకున్నారు. పరిస్థితులకు అనుగుణంగా క్రమంగా దాన్ని తగ్గించుకుంటూ వచ్చి వంద కోట్లలోపే పూర్తి చేశారు. ఓటిటి మార్కెట్ హఠాత్తుగా పడిపోవడంతో నిర్మాతకు ఫైనాన్స్ తేవడం కూడా ఒకదశలో కష్టమైపోయింది. విగ్నేష్ భార్య నయనతార డబ్బు సర్దుబాటు చేసింది. ఇక టైటిల్ గురించి చెబుతూ ముందు ఎల్ఐసీ అని పెడదామనుకుని అనుమతి అడిగితే వాళ్ళు ఏకంగా 112 కోట్లు డిమాండ్ చేయడంతో వెనక్కు తగ్గి ఎల్ఐకె ఆప్షన్ ఎంచుకున్నానని అన్నారు. అంత డబ్బు లేకపోవడంతో నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చిందని క్లారిటీ ఇచ్చారు. అయితే ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఇలా ఒక సినిమాకు తమ పేరు పెట్టుకోవడానికి అంత డిమాండ్ చేసిందానేది అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. దీనికి సంబంధించి ఏదైనా క్లారిటీ వస్తే బెటర్. ఇదంతా ఎలా ఉన్నా లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అయిదు రోజులకు గాను సుమారు నలభై కోట్ల దాకా వసూలు చేసి డీసెంట్ అనిపించుకుంది. అది కూడా ప్రదీప్ రంగనాథన్ ఇమేజ్ వల్ల తప్పించి మరొకటి కాదు. విగ్నేష్ శివన్ దర్శకత్వం మీద నెగటివ్ కామెంట్స్ ఎక్కువగా వచ్చాయి. 2040 బ్యాక్ డ్రాప్ తో ఇంత సాగదీసిన టెక్నికల్ లవ్ స్టోరీ ఎందుకు చెప్పాడని విమర్శకులు తలంటారు. తెలుగు వర్షన్ మాత్రం అనుకున్న దానికన్నా త్వరగా వాషౌట్ అయిపోయేలా ఉంది.

# ఎన్టీఆర్ సినిమా కోసం ధనుష్ మూవీ త్యాగం





సప్తసాగరాలు దాటి' అనే చిన్న సినిమాతో రుక్మిణి వసంత్ అనే కన్నడ అమ్మాయి ఎంత మంచి పేరు సంపాదించిందో తెలిసిందే. ఆ సినిమాలో తన అందం, అభినయానికి అందరూ ఫిదా అయిపోయారు. అందులో ఆమె చేసింది గ్లామర్ రోల్ ఏమీ కాదు. కానీ చూడముచ్చటగా కనిపిస్తూ, చక్కటి అభినయాన్ని ప్రదర్శించడంతో ఆమెకు పెద్ద ఎత్తున అభిమానులు తయారయ్యారు. ఈ గుర్తింపు వివిధ భాషల్లో వరుసగా సినిమా అవకాశాలు అందుకుంది రుక్మిణి. ప్రస్తుతం సౌత్ ఇండియన్ బిగ్గెస్ట్ స్టార్ హీరోయిన్లలో ఆమె ఒకరు. తన కెరీర్లోనే బిగ్గెస్ట్ మూవీని ప్రస్తుతం తెలుగులోనే చేస్తోంది రుక్మిణి. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న ఆ చిత్రమే.. డ్రాగన్. ముందు అనుకున్న ప్రకారమైతే ఈపాటికి ఈ సినిమా షూట్ పూర్తి అయిపోయుండాలి. జూన్‌లో రిలీజ్ అని కూడా అన్నారు. కానీ పెద్ద సినిమాల చిత్రీకరణ ఆలస్యం కావడం, రిలీజ్ వాయిదా పడడం అన్నది ఇప్పుడు చాలా కామన్ వ్యవహారం. 'డ్రాగన్' కూడా అందుకు మినహాయింపు కాలేకపోయింది. షూట్ ఇంకా చాలా రోజులే బాకీ ఉన్నట్లు తెలుస్తోంది. తారక్ సహా ఈ సినిమాలో భాగమైన ఆర్టిస్టులందరూ ఇందులో స్ట్రక్ అయిపోయారు. రుక్మిణి ఈ చిత్రం కోసం ఇంకో క్రేజీ ప్రాజెక్టును వదులుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. తమిళంలో ధనుష్ హీరోగా 'లబ్బర్ పందు' డైరెక్టర్ తమిళరసన్ ఓ సినిమా రూపొందిస్తున్నాడు. ఈ చిత్రానికి ముందు రుక్మిణినే కథానాయికగా అనుకున్నారు. కానీ ఆమె నటిస్తున్న 'డ్రాగన్' అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. దాని కోసం అదనంగా బల్క్ డేట్లు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో ధనుష్ సినిమాను ఆమె వదులుకోవాల్సి వచ్చింది. రుక్మిణి స్థానంలో 'దురంధర్'తో సెన్సేషన్ అయిన సారా అర్జున్‌ను తీసుకుంటున్నారట. సారా.. బాలనటిగా తమిళంలో చాలా సినిమాలు చేసింది. ఇప్పుడు కథానాయికగా ఆమెకు తమిళంలో ధనుష్ చిత్రమే మొదటిది కాబోతోంది. ఆమె తెలుగులో ఇప్పటికే 'యుఫోరియా' సినిమా చేసిన సంగతి తెలిసిందే.




## ట్రంప్ ప్రకటనతో బుల్ జోరు.. రూ.10లక్షల కోట్లు పెరిగిన సంపద



దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన మార్కెట్లలో జోష్ నింపింది. దీంతో సూచీలు నేడు భారీగా లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం 77,981 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ (క్రితం ముగింపు 76,847) ఒక దశలో 78,270కి పెరిగింది. చివరకు 1263 పాయింట్ల లాభంతో 78,111 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 388 పాయింట్లు లాభపడి, 24,231 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.37గా ఉంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. తమ బలగాలు హర్మూజ్‌ను దిగ్బంధించడంతో ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు నిలిచిపోయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే యుద్ధం ముగింపు దశకు చేరుకుందని, ఇరాన్‌తో చర్చలు ఉంటాయని ట్రంప్ ప్రకటించారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ఉన్నాయి. ఇక, చమురు ధరలు కూడా కాస్త దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 95 డాలర్లుగా ఉంది. ఇవన్నీ నేటి ట్రేడింగ్‌లో మదుపర్లకు లాభాలను తెచ్చిపెట్టాయి.

## రేపటి నుంచి ఈ బ్యాంక్ అకౌంట్లు క్లోజ్!

దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) కీలక నిర్ణయం తీసుకుంది. నిరుపయోగంగా ఉన్న లక్షలాది ఖాతాలను రేపటి (ఏప్రిల్ 16) నుండి శాశ్వతంగా మూసివేయాలని బ్యాంక్ యాజమాన్యం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఇతర ప్రభుత్వ బ్యాంకుల బాటలోనే పీఎన్‌బీ కూడా ఈ కఠిన చర్యలకు ఉపక్రమించడం బ్యాంకింగ్ రంగంలో చర్చనీయాంశంగా మారింది.

ఎవరి ఖాతాలు మూతపడతాయి?

మీడియా నివేదికల ప్రకారం.. ఈ కింది కేటగిరీల కిందకు వచ్చే ఖాతాలను బ్యాంక్ మూసివేయనుంది.

మూడేళ్లుగా లావాదేవీలు లేనివి: గత మూడేళ్లుగా కనీసం ఒక్కసారి కూడా వాడని ఖాతాలు.

జీరో బ్యాలెన్స్: ఖాతాలో జీరో బ్యాలెన్సు ఉండి, చాలా కాలంగా ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఖాతాలు.

కేవైసీ అప్‌డేట్ లేనివి: గడువులోపు వ-ఖ్‌జ (ఈ-కేవైసీ) పూర్తి చేయని ఖాతాలపై బ్యాంక్ వేటు వేసే అవకాశం ఉంది.

ఎందుకీ కఠిన నిర్ణయం?

బ్యాంకులో వేల సంఖ్యలో నిరుపయోగంగా పడి ఉన్న ఖాతాల వల్ల మోసాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని బ్యాంక్ భావిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా, అలాగే బ్యాంక్ డేటాను ప్రక్షాళన చేసే ఉద్దేశంతో క్రమానుగతంగా ఇటువంటి చర్యలు చేపడుతుంటారు.

ఖాతాను కాపాడుకోవాలంటే..




మీ ఖాతా క్లోజ్ కాకుండా ఉండాలంటే వెంటనే ఈ కింది పనులు పూర్తి చేయండి:

మీ సమీపంలోని పీఎన్‌బీ బ్రాంచ్‌కు వెళ్లి వెంటనే ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయండి.

మీ అకౌంట్‌లో కొంత మొత్తాన్ని జమ చేయండి.

కనీసం ఒక చిన్న లావాదేవీ (డ్రా చేయడం లేదా జమ చేయడం) చేయడం ద్వారా అకౌంట్ యాక్టివ్‌గా ఉందని నిర్ధారించుకోండి.

తీసుకెళ్లాల్సిన పత్రాలు

ఈ పనుల నిమిత్తం బ్యాంకుకు వెళ్లేటప్పుడు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, విద్యుత్ లేదా నీటి బిల్లు (అడ్రస్ ప్రూఫ్ కోసం), బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్ పత్రాలతో పాటు వాటి ఫోటోకాపీలను (జిరాక్స్) వెంట తీసుకెళ్లడం మర్చిపోకండి

## భారత్-అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు..



భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు మళ్లీ మొదలుకానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం భారత అధికార ప్రతినిధి బృందం వచ్చేవారం అగ్రరాజ్యానికి వెళ్లనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికార వర్గాలు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా- భారత్ మధ్య ఇప్పటికే తాత్కాలిక వాణిజ్యఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. తాజా చర్చల్లో ఈ ఒప్పందంపై ఇరుదేశాలు ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిజానికి ఈ ఒప్పందంపై మార్చిలోనే సంతకాలు చేయాలని గతంలో ఇరుదేశాలు అనుకున్నాయి. అయితే, అధ్యక్షుడు ట్రంప్ పలు దేశాలపై విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. తాజాగా వీటిని పునరుద్ధరించేందుకు ఇరుదేశాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జులై ఆరంభం నుంచి టారిఫ్‌లను పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ (ాషీ దీవంంవత్) తెలిపారు. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ తాము తగ్గమని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం సెక్షన్ 301 ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ చట్టం కింద విధించే సుంకాలకు ఇప్పటికే న్యాయపరమైన గుర్తింపు ఉందన్నారు.

## రోజంతా బ్యాటరీ వస్తుందని వివో చెబుతోంది

### మరి దీని ప్రత్యేకతలు, ధర, ఇతర వివరాలు మీకోసం..

వివో T5 ప్రో ప్రత్యేకతలు

6.83 అంగుళాల 1.5ఖ అమోలెడ్ డిస్‌ప్లే, HDR 10+ సపోర్ట్

144ఎఓ రిఫ్రెష్ రేట్, 5,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్

క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7ం Gen 4 ప్రాసెసర్

8జీబీ/ 12జీబీ (LPDDR4X) ర్యామ్

128జీబీ/ 256జీబీ (ఖఫీూ 3.1) స్టోరేజ్

50ఎంపీ మెయిన్ కెమెరా (సోనీ IMX882)

2 ఎంపీ డెప్త్ సెన్సార్

ముందువైపు 32ఎంపీ సెల్ఫీ కెమెరా

ఐపీ68ం, ఐపీ69ం రేటింగ్

9,020పాహ్ర సిలికాన్ యానోడ్ టెక్నాలజీ బ్యాటరీ

7000 ఎఎ2 వీసీ కూలింగ్ సిస్టమ్

ఇండిపెండెంట్ గేమింగ్ యాంటీనా

90ఔ ఫ్లాష్ వైర్డ్ ఛార్జింగ్




50శాతం ఛార్జింగ్ 37 నిమిషాల్లోనే

ఎస్‌జీఎస్‌లో బ్లూ లైట్ సర్టిఫికేషన్

ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజన్ ఓఎస్

3 ఏళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్

వేరియంట్స్.. ధర.. ఆఫర్లు ఇవే..

వివో T5 ప్రో మూడు వేరియంట్లలో లభ్యం కానుంది. 8+దీ ం128+దీ వేరియంట్ ధర రూ.29, 999.. 8GB+ 256GB 33,999.. 12J;+256J; ధర రూ.39, 999గా కంపెనీ నిర్ణ యించింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగ దారులకు రూ.3 వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.3 వేలు వరకూ రాయితీ పొందవచ్చు. ఆరు నెలల వడ్డీ రహిత వాయిదాల్లోనూ దీని కొనుగోలుకు అవకాశం ఉంది. ఏప్రిల్ 21 నుంచి ఫ్లిప్‌కార్ట్, వివో వెబ్‌సైట్‌ల వేదికగా ఈ ఫోన్ అందుబాటులోకి రానుంది.

# ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**అడిషనల్ కలెక్టర్ బి రాజగౌడ్**

**ఫైలేరియా(బోధకాలు) వ్యాధి పై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం**



**జగిత్యాల,ఏప్రిల్ 15(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బి రాజగౌడ్ అన్నారు.బుధవారంఫైలేరియా(బోధకాలు) వ్యాధి పై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం అడిషనల్ కలెక్టర్ బి రాజగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బోదకాలు వ్యాధి తీవ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాధి తీవ్రత 1% కన్నా తక్కువ రావడం,మన జిల్లా డోసియర్ సమర్పించడానికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్మూలించడానికి తీసుకునే చర్యలను అడిగి తెలుసుకున్నారు.ఆనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి ఉచరేరియా బ్రాంకరాఫ్టి అనే పరాన జీవి వలన వస్తుందని దీనికి కారణమైన క్యూలెక్స్ దోమలను అరికట్టవలెనని తెలిపారు. ఈ పరాణజీ వులు రక్తనాళాలలో లోపల ఉండి రాత్రి పూట మాత్రమే పరిధియ రక్తనాళాలలో ప్రవేశిస్తాయని అందుకనే ఈ వ్యాధి నిర్ధరించడానికి రాత్రిపూట మాత్రమే నైట్ బ్లడ్ స్మియర్ రాత్రి 8 నుండి 12 గంటల లోపు తీస్తారని తెలిపారు. మన జిల్లాలో 30 సైట్లు ఎంపిక చేసామని రాత్రిపూట మీరందరికి హెల్త్ అసిస్టెంట్ల ద్వారా రక్త పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి నేషనల్ కంట్రోల్ ఫర్ వెక్టార్ బోర్న్ డిసీజెస్ డాక్టర్ పి అర్చన, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి హేమంత్ , కార్యదర్శి డాక్టర్ సుధీర్, జనరల్ ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ శ్రీపతి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు రామచంద్రం, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ హెచ్ఈఓ శ్రీధర్, హెల్త్ ఎడ్యుకేటర్స్ భూమేశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# అనాధ పిల్లల మధ్య ఘనంగా జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మనదేశమ్ ప్రతినిధి) ఏప్రిల్ 15**భద్రాచలం పట్టణంలోని కారుణ్య అనాధ పిల్లల ఆశ్రమంలో కూకట్‌పల్లి జిల్లా కోర్టు జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను చేతన మీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ సమన్వయం చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాధ చిన్నారుల కోసం 25 కిలోల బియ్యం, అరటి పండ్లు అందజేశారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. పిల్లలతో కలిసి జరుపుకున్న ఈ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మరియు చిన్నారులు మాట్లాడుతూ, జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదినాన్ని తమ మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సేవా భావంతో అనాధ పిల్లల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం ద్వారా మంచి సందేశాన్ని సమాజానికి అందించారని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళీ, ఫోటోగ్రాఫర్ అమ్మ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండో మహాసభ జయప్రదం చేయండి.. భారత కమ్యూనిస్టు పార్టీ




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 15: బూర్గంపహాడ్ ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక సిపిఐ ఆఫీసులో కార్యవర్గ సమావేశం బర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేరాల శ్రీనివాసరావు సిపిఐ బూర్గంపహాడ్ మండల కార్యదర్శి సభక నాగేశ్వరరావు హాజరై వారు మాట్లాడుతూ ఏప్రిల్ 17,, 18,, తేదీల్లో వరంగల్ లో జరుగు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు మరియు డి హెచ్ పి ఎస్ రాష్ట్ర రెండో మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ తరతరాలుగా అణిచివేత అంటరానితనం వివక్ష దోపిడి పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక కులం ఆ అభ్యున్నతి లక్ష్యంగా ఆవిర్భవించింది దళిత హక్కుల పోరాట సమితి డి హెచ్ పి ఎస్ అన్నారు సమాజంలో తరతరాలుగా అంటరానితనం అనేక అవమానియా దురాచారానికి అత్యంత దారుణంగా బలైపోతున్న దళితులను సామాజిక ఆర్థిక రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి అణిచివేతలను ఏ దిరించి సమానత్వాన్ని సాధించేందుకు సంఘటితంగా చైతన్యవంతం చేయుటకు ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళుతున్నది దళిత హక్కుల పోరాట సమితి అన్నారు ఈ కార్యక్రమంలో సిద్ధారపు సుబ్బారెడ్డి, శంకర్ రెడ్డి , పాండవుల బిక్షం, ముదిగొండ బాలకృష్ణ, కరుటూరు రాము, తోకల శీను ,తదితరులు పాల్గొన్నారుయూఎస్ ట్రేడ్ డీలుకు వ్యతిరేంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నరు

# మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కాంగ్రెస్ జాతీయ యువజన కార్యదర్శి రోషిని జైస్వాల్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్ష ను నిమ్మ రసం ఇచ్చి దీక్షను మునిసిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ విరమింప చేయడం జరిగింది.యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల దేశియా రైతులు , వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతాయాన్ని ఆందోళన వ్యక్తం చేసారు...ఈ ఒప్పందం వలన విదేశీ కంపెనీలకు అధిక ప్రాధాన్యం లభించి, స్థానిక ఉత్పత్తులు మరియు రైతుల జీవనోపాధి పై ఎక్కువగా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు గొడుగుల శ్రీనివాస్, సర్దార్, ఇమ్రోజ్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సందీప్ జిల్లా కార్యదర్శులు అజ్మాత్, అన్వేష్ ,కౌన్సిలర్స్ మజీద్, అంజాద్, సత్యం, గణేష్, బబ్లు, లడ్డు, సిద్దిక్, జావీద్, వివిధ రాజకీయ పార్టీలు ,రైతు సంఘాలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన




**జగిత్యాల, ఏప్రిల్ 15(నేటి మన దేశమ్ ప్రతినిధి):** అగ్నిమాపక వారోత్సవాలలో బాగంగా బుధవారం తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణ ప్రజలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు బస్ స్టాండ్ ప్రాంతాలు ఇతర ప్రజా రద్దీ ప్రాంతాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్, ఓల్డ్ బస్ స్టాండ్ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ పాంప్లెట్లు, బ్రోచర్లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన భద్రతా సూచనలు, ఫైర్ ఎక్విప్మెంట్ వినియోగం, ఎమర్జెన్సీ నంబర్ల ప్రాముఖ్యత గురించి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద సుమారు 400 మంది ప్రజలు, టవర్ సర్కిల్ వద్ద సుమారు 200 మంది ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ మాక్ డ్రిల్స్‌లో సంబంధిత బస్ స్టాండ్‌ల డిపో మేనేజర్ తో పాటు జిల్లా అగ్నిమాపక అధికారి వై. సైదులు, జగిత్యాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ. కృష్ణకాంత్,సిబ్బంది ఎల్ఎల్ఎఫ్ కె. రవీందర్, జి. మధు, ఎఫ్ఎఫ్టిలు ఎ.మల్లేశం, బి. ప్రణయ్ కుమార్, బి. వెంకటేశ్వర్లు, ఎఫ్ఎఫ్ లు ఎం. కార్తీక్, ఎం. రాజేందర్, హెచ్ జి జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నో సంవత్సరాల తర్వాత గుడిసె నుంచి స్వంత ఇంటికి

**ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు కల సాకారం**

**మా కుటుంబం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు సిహెచ్. మమత**



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** ఎల్లారెడ్డి నియోజకవర్గం, నాగిరెడ్డిపేట్ మండలం,జప్తి జంకంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు.గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు సీహెచ్ మమత (భర్త సిద్ధిరాములు) నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారురాలు మమత మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా గుడిసెలో నివసిస్తున్న తమకు ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ప్రస్తుతం స్వంత ఇంటిలో గృహప్రవేశం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తమ కుటుంబం తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గరుకుల్ విద్యార్థిని కలిగోట వీణ ను అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కలిగోట వీణ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ గర్వకారణంగా నిలిచింది.ఇటీవల రాంచీ, రాజగిర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్‌లలో ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికైంది. ఈ ఇండియన్ టీం క్యాంప్ ఏప్రిల్ 19 నుండి భోపాల్‌లోని ఎస్ ఏ ఐ సెంటర్‌లో నిర్వహించబడనుంది. ఇక్కడి నుంచే జపాన్‌లో జరగనున్న సబ్ జూనియర్ (యు–18) ఆసియా కప్‌కు భారత జట్టు కు ప్రాతినిధ్యం వహించనుంది. అండర్ 18 ఇండియన్ టీం కి సెలెక్ట్ అయిన కలిగొట వీణ ను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తన చాంబర్ లో అభినందించి, శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# ఓరగంటి రంజిత్ ని సన్మానించిన విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాస రావు



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి )::**కొమురం భీమ్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన ఓరగంటి రంజిత్ కుమార్ ను వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకై తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ నుండి వైజాగ్ వరకు 13 జిల్లాల మీదుగా 1000కి.మీ సైకిల్ యాత్ర చేస్తున్న సందర్భంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి యూనివర్సిటీకి చేరుకున్న సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో ఫౌండర్ విజయ్ కలాం ను మరియు ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఓరగంటి రంజిత్ కుమార్ గారిని అభినందించి శాలువాతో సత్కరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజం కోసం సైకిల్ యాత్రలో భాగస్వామ్యం కావాలని అన్నారు.

# మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50% సబ్ కోటా కేటాయించాలి

**స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలుచీకూరి లీలాగౌడ్**



**హుజూర్ నగర్ ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికగా 50 శాతం సబ్ కోటా కేటాయించాలని బీసీ మహిళా నాయకురాలు చీకూరి లీలావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీ మహిళలకు మద్దతుగా నిలవాలని కోరారు.అప్పుడే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు బీసీ మహిళలు నారిశక్తిగా గళం విప్పి తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. ఇప్పుడే స్పందించకపోతే మహిళా రిజర్వేషన్లలో అగ్రవర్ణాల మహిళలకే అధిక ప్రాధాన్యం దక్కే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి బీసీ గళం పార్లమెంట్‌కు చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా "ఒక పోరాటం" స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలిగా తాను బీసీ మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానని చీకూరి లీలావతి స్పష్టం చేశారు.

# కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో ఉద్రిక్తత

**ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కు అక్రమంగా అరెస్టు చేసి భిక్నూర్ పోలీస్ స్టేషన్ కు తరలింపు**



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఎల్లారెడ్డిలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో మృతి చెందిన శ్రావణి మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తూ... బీసీ హాస్టల్లో మృతి చెందిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడ కామారెడ్డి వెళ్లే రహదారిపై ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్.ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు.హాస్టల్లో మృతి చెందిన బాలిక మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే సురేందర్ బాలిక కుటుంబ సభ్యుల డిమాండ్.ధర్నాకు దిగిన సురేందర్ తో పాటు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు.బాలికపై లైంగిక దాడి జరిగిందని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు.

# వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి-కలెక్టర్ రాజర్షి షా

**-చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.**




**ఆదిలాబాద్ ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.సాధారణ స్థాయికి మించి 1.5సీసి నుంచి 3.5సీసీ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని,జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.పట్టణాలు,గ్రామాలు,ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు,రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ (ఓరిస్సా ) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు.జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు.అలాగే,అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని,ఫస్ట్ ఎయిడ్ కిట్లు,డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఇళ్లగణనకు సంబంధించి

## స్వీయ నమోదుకు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు...



**భీమునిపట్నం ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** :మహా విశాఖ నగరపాలక సంస్థ జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో జనగణన-2027కు వినూత్న విధానాలు అమలు చేస్తున్నారు. ముందు ఇళ్లగణన నిర్వహించి. ఆ తర్వాత జనగణనకు శ్రీకారం చుడతారు. గతంలో ఎన్యుమరేటర్లు గడపగడపనకు వచ్చినప్పుడు ఇళ్లల్లో ఎవరూ లేకపోతే జనాభా లెక్కల్లో సరిగా నమోదులు జరిగేవి కావనీ. ఈ దఫా అంతర్జాలంలో వచ్చే లింకులో స్వీయ నమోదుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు భీమునిపట్నం జోనల్ కమిషనర్ ఎమ్ విజయకుమార్ పేర్కొన్నారు. తొలుత వచ్చే మే 1 నుంచి 31వ తేదీ వరకు ఇళ్ల గణన చేపట్టనున్నారు. ఇందులో 34 ప్రశ్నలతో వివరాలను ఇంటింటా రాబడతారు. ఇదే ఇళ్లగణనకు సంబంధించి స్వీయ నమోదుకు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు అంతర్జాలంలో లింకు అందు బాటులో ఉంచుతున్నారు.రెండో విడతగా 2027 ఫిబ్రవరిలో ఇళ్లతో సంబంధం లేకుండా జనగణన జరగనుంది. ఈ సందర్భంలో ఇళ్లు లేకుండా రోడ్డు మార్జిన్లు, బస్టాండ్లలో తల దాచుకునే వారి వివరాలను కూడా సేకరించి 2027 మార్చి 1న భారతదేశ జనాభా గణాంకాలు విడుదల కానున్నాయి.ఇళ్ల గణన స్వీయ నమోదును జాతీయ జనగణన పోర్టల్ ' https://se.census.gov.in వెబ్సైట్, ఫోన్ యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. పోర్టల్, యాప్లో ఇంటి యజమాని ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ నమోదు చేశాక ప్రశ్నావళితో కూడిన పోర్టల్ వస్తుంది. వాటికి సమాధానాలు ఇచ్చి సబ్మిట్ చేయాలి. అనంతరం హెచ్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఐడీ వస్తుంది. ఇళ్ల గణనకు వచ్చే ఎన్యుమరేటర్లకు ఈ ఐడీని చూపించాలి. వారు మరోసారి సరిచూసి మార్పులుంటే చేస్తారు.ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు తొలుత స్వీయ నమోదులో పాల్గొన్నారా లేదా అనేది నివృత్తి చేసుకుంటారు. స్వీయ నమోదులో పాల్గొంటే వారి వివరాలు సేకరిస్తారు.సీరియల్ సెన్సస్ హౌస్, హౌస్ హోల్డ్ సీరియల్, భవనం నంబర్లు, ఇంటి నేలకు వాడిన ప్రధాన వస్తువులు, గోడకు వినియోగించిన వస్తువు, పైకప్పు వివరాలు నమోదు చేస్తారు. గృహం వాడుక నివా సమా? లేక ఇతరమా, పూరిల్లా లేక భవనమా తదితరాలు సేకరిస్తారు.

కుటుంబంలో నివసిస్తున్న మొత్తం సభ్యుల సంఖ్య, యజమాని పేరు, జెండర్, కులం, ఇల్లు అద్దె లేక సొంతమా? గదుల సంఖ్య, ఎంతమంది నివసిస్తు న్నారు. తాగునీటి వనరు, మరుగుదొడ్డి వసతి, ఎల్పీజీ, పీఎనీ కనెక్షన్లు, ల్యాప్టాప్, కంప్యూటర్లు, స్మార్ట్ఫోన్లు, వాహనాలు ఉన్నాయా? ఇలా 34 రకాలు ప్రశ్నలకు సంబంధించి వివరాలు నమోదు చేస్తారు.

# పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు

## మంత్రి నిమ్మల



**పోలవరం, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** :విదేశీ నిపుణుల సూచనలతో నాణ్యతలో రాజీ లేకుండా గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్ నిర్మాణం, గ్యాప్-1, గ్యాప్-2, ఎర్త్ కం రాక్ఫిల్ డ్యాం ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు కార్యాలయంలో జలవనరులశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ...రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. గత ప్రభుత్వ పాలన నిర్లక్ష్యం వల్ల ధ్వంసమైన డయా ఫ్రంవాల్ను సరిచేస్తే సరిపోతుందని నిపుణులు చెప్పినా నాణ్యత, ప్రజా భద్రతల విషయంలో రాజీ పడకూడదనే కొత్త డయా ఫ్రంవాల్ నిర్మించామని తెలిపారు. కొత్త డయా ఫ్రంవాల్ నిర్మాణం 1,372 మీటర్లకుగాను 1300 మీటర్ల వరకూ పనులు పూర్తయ్యాయని, ఈ నెలాఖరు నాటికి డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తవు తుందని చెప్పారు.

ప్రాజెక్టు ప్రధాన కాలువల అను సంధాన పనుల్లో ముఖ్యమైన కుడి, ఎడమ కాలువలను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

'మా వల్లే మీకు పరిహారం వచ్చిందంటూ' దళారులు, మధ్యవర్తులు నిర్వాసితులను మోసం చేస్తు న్నారని, ఇటువంటి వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు.

# జాబ్ కేలండర్ విడుదల చేయాలి : డివైఎఫ్ఐ




**మాధవధార, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని, గత ఐదేళ్లుగా రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున నిరుద్యోగుల వయోపరిమితి 47కు పెంచాలని డివైఎఫ్ఐ నాయకులు రాజు, శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బిర్లా జంక్షన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు నోటిఫికేషన్లు లేవన్నారు. మూడు నెలలు క్రితం ముఖ్యమంత్రి 4.71 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని, ఇప్పుడు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఏకంగా 6.28 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించడం యువతను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. కేవలం కార్పోరేట్ సంస్థలు ఇచ్చే కమిషన్ కోసం రాష్ట్రంలో ఉండే విలువైన భూములను లూటీ చేసి వారికి అప్పగించి బయట మాత్రం ఉద్యోగాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగు తుంటే అసెంబ్లీలో చర్చించి యువతకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం లడ్డు చుట్టూ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు, లైబ్రరీయన్ పోస్టులు, యానిమల్ హస్బెండరి అసి స్టెంట్ పోస్టులను, ఇంజినీరింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పది వేలకుపైగా పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో గత ఐదేళ్లుగా 4వేలకు పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలి పారు. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, సంతోష్, రమేష్, దేవుడు, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా

## ఎలుకల నివారణ మందు పంపిణీ



**అమలాపురం ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** : అమలాపురం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు ప్రభుత్వం ద్వారా బ్రోమోడయోలిన్ అనే ఎలుకల నివారణ మందును బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. పంటలకు ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుట, రైతులకు పంట సంరక్షణలో సహాయపడుట లక్ష్యంగా ఏ వేమవరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కె. ప్రవీణ్ అన్నారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు ఎలుకల నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించడంతో పాటు, బ్రోమోడయోలిన్ మందును ఎలా ఉపయోగించాలో కూడా వివరించారు. రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ

## పోస్టర్లు ఆవిష్కరణ



**పాలకొండ, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** : బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్పై రూ.60, వాణిజ్య సిలిండర్పై రూ.115 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ పాలకొండలో మంగళవారం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచడం వల్ల, సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. పశ్చిమ ఆసియాలో జరుగు తున్న యుద్ధం వల్ల గ్యాస్ ధరలు పెంచాల్సి వచ్చిందని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పెద్ద కానుక ఇచ్చారని విమ ర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్యామల, జి.శారద, కె. శారద, ఎల్. జయమ్మ, ఎస్. రజిని, జి. జెస్సీబారు, రాధా రాణి, ప్రభావతి, పి.శ్రీదేవి, ధనలక్ష్మి, గౌతమి, ఆశా, అం౧ ˇన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లేగదూడను చంపిన పులి



**పాలకొండ, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** : పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం మారేడుబాక పంచాయతీ జి.శరభవరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో లేగదూడపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్తుల కథనం మేరకు.. జి.శరభవరం గ్రామ సమీపంలో కోసూరువీధికి చెందిన గణపతికి చెందిన లేగదూడపై పులి దాడి చేసింది. దూడ మెడ భాగంలో తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మరణిం చింది. ఘటనా స్థలాన్ని సబ్ డిఎఫ్ఒ సుబ్బారెడ్డి, రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి, ఫారెస్ట్ సిబ్బంది పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించారు. రెండు రోజులుగా ఆకలితో ఉన్న పులి మూగ జీవాలను మట్టుబెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంతాల వారిని అధికారులు హెచ్చరించారు. పులిని బంధించేందుకు నాగార్జున సాగర్ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ పొందిన బృందం అటవీశాఖ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టింది. పెద్దపులి కదలికలను గుర్తించి సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపులి కదలికలపై ప్రత్యేక అధికారి బిఎస్ఎన్ మూర్తి, సిసిఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, డిఎఫ్ఒ శివకుమార్ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. పులి దాడి చేసి హతమార్చిన చిన్న పశువుకు రూ.ఐదు వేలు, పెద్ద పశువుకు రూ.15 వేలు నష్టపరిహారం అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# ఘనంగా అవంతి లో ఫార్మసీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం



**భీమునిపట్నం ఏప్రిల్ 15 నేటి మనదేశమ్** : తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఆడోటోరియంలో భిపార్మసి ఆద్వర్యంలో ఫేరవెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి అవంతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అవంతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి అవంతి మాట్లాడుతూ ఈరోజు మీ అందరి ముఖాలలో ఒకవైపు గ్రాడ్యుయేషన్ అవుతున్నామనే సంతోషం,మరోవైపు ఇన్నాళ్లు కలసి ఉన్న స్నేహితులను,ప్రాంగణాన్ని వదిలి వెళుతున్నామనే చిన్నపాటి బాద "అప్పుడే నాలుగేళ్ళుగడిచిపోయాయా" అనే భావోద్వేగం లో మీలో స్పష్టంగా కనిపిస్తుంది అని,మీరు కేవలం పట్టబద్రులు గా పూర్తి చేసుకొని మీరంతా వివిద రంగాల్లో మీ మీ గమ్యాలకు చేరువుగా వెళుతున్నారే గాని మీరు ఎప్పటకీ అవంతి కాళాశాల లో అంతర్భాగమే అని అన్నారు. "భిఫార్మసి" పూర్తి చేసిన మీ అందరికి ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.అనంతరం ముఖ్య అతిథులు ను అవంతి ఘనంగా నిర్వహించి బిఫార్మిసి భోదనా సిబ్బందికి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమం లో...

బిఫార్మసి ప్రిన్సిపాల్ పూర్ణ నాగశ్రీ, కళాశాల డైరెక్టర్ ఎ.ఆకుల చంద్ర శేఖర్,ఎడ్మిన్ డైరెక్టర్ విశ్వ ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ ఉమా శంకర్, బోదనా, బోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణలో మహిళలు కీలకం

## డాక్టర్ డి.లక్ష్మి తులసి




**విశాఖపట్నం, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని ఎండాడలో ఉన్న డాక్టర్ లూక్స్ క్యాంపస్, సెయింట్ లూక్స్ స్కూల్ ఌ కాలేజ్ ఆఫ్ నర్సింగ్తో కలిసి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ "మహిళా నర్సులు: ఆరోగ్యవంతమైన విశాఖపట్నం నిర్మాణం" అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమా నికి జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.లక్ష్మి తులసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో నర్సులు పోషిస్తున్న కీలక పాత్రను ఈ సందర్భంగా వారు చాటిచెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో నర్సింగ్ సిబ్బంది కీలకంగా నిలుస్తారని చెప్పారు. వైద్య, నర్సింగ్ వృత్తిలో అధికంగా మహిళలు ఉంటారని సమాజ ఆరోగ్య పరిరక్షణలో మహిళలు ఎంతో ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. కుటుంబ ఆరోగ్యంతో పాటు వారు సమాజ ఆరోగ్యాన్ని నిరంతరం సంరక్షిస్తున్నారన్నారు. సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. ప్రభావతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లి సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, అతిథులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

# వరికి మొవ్వ, దోమ పోటు సోకే అవకాశం



**పెద్దాపురం, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** : వరి పంటలో వాతావరణ పరిస్థితులను బట్టి మొవ్వ పోటు, దోమపోటు అధికంగా సోకే అవకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు ఎన్.విజరు కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లమూరు, గోరింట గ్రామాలలో వరి, మొక్కజొన్న, చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి చేలు అంకురం ఏర్పడే దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో పొటాస్ ఎరువును వినియోగించడం వల్ల తెగుళ్లు, పురుగులను తట్టుకుంటుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ తప్పకుండా రిజిస్ట్రీ చేయించుకుని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. రాబోయే కాలంలో ఈ విశిష్ట సంఖ్యను ఆధారంగా వ్యవసాయ శాఖ ద్వారా అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీలు రైతులకు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంజరుకుమార్, దేవళ్ల సతీష్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు దేవళ్ళ బోసు, డిజఏసు బాబు, ఎఎంసి డైరెక్టర్ జలదాని సుబ్రహ్మణ్యం, కర్రి భాస్కర్రాజు, పచ్చిపాల ఏసు, విఎఎలు, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించాలి

**విజయనగరం, ఏప్రిల్ 15, నేటి మనదేశమ్** :గుంకలాం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికుల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మూడో కాలనీగా పేరుగాంచిన గుంకలాం జగనన్న లేఅవుట్లో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. ప్రధాన రహదారి పాడైందని తెలిపారు. కాలనీలో 12,976 ఇళ్లు మంజూరు చేశారని, సుమారు 879 మంది ఆరు బ్లాకుల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు.

ఇక్కడ చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలు లేవని, తాగునీటి సౌకర్యం కల్పించలేదని చెప్పారు.

దొంగల బెడద తీవ్రంగా ఉందన్నారు. నైట్ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు శాంతి, సుధామాధవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ క్రమ-శిక్షణతో రోడ్డు ప్రమాదాల నివారణ

**- పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ**




**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్,రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తా వద్ద వాహనదారులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వీయక్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను అరికట్టవచన్నారు. రోడ్డుపై ప్రయాణం చేసే సమయాల్లో మనం చేసే చిన్న చిన్న తప్పిదాలు మనతో పాటు ఎదుటివారిని కుటుంబాలని రోడ్డుపై పడేయచ్చని, ట్రాఫిక్ నింబంధనలు ఉన్నది మీ రక్షణ కోసమే అని ట్రాఫిక్ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యం చేరాలని తెలిపారు.వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, స్వీయారక్షణార్ధం హెల్మెట్ తప్పక ధరించాలని,వాహనాలు నడిపే సమయాల్లో మొబైల్ ఫోన్ వడాద్దని,తల్లిదండ్రులు మైనర్ పిల్లలు వాహనాలు ఇవ్వవద్దని మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు.జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వస్తున్నామని ప్రజలు వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ రక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఆర్ఐ సురేష్, ఎస్ఐ శ్రీకాంత్, ఆర్ ఎస్ఐ శ్రీనివాస్, పృథ్విధర్ పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కప్ తో క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపు

**- బీఆర్ఎస్ నేత చెల్మెడ లక్ష్మీనరసింహారావు**




**వేములవాడ, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** యువత చెడు అలవాట్ల గురి కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపి గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి జిల్లా స్థాయి వరకు ఎదగాలనే ఒక మంచి ఉద్దేశంతో కేసీఆర్ కప్ టోర్నమెంట్ నిర్వహించామని, ఈ కేసీఆర్ టోర్నమెంట్ తో క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. బుధవారం కొనరావుపేట మండలంలో కెసిఆర్ కప్ టోర్నమెంటు ఫైనల్లో కోనరావుపేట, నిజామాబాద్ జట్లు తలపడగా, కోనరావుపేట టీమ్(కొనరావుపేట సూపర్ కింగ్స్) విజేతగా నిలిచింది. గెలిచిన కోనరావుపేట టీమ్ కు 50వేల నగదు, బహుమతితోపాటు, రన్నరప్ గా నిజామాబాదు, కోనరావుపేట బుల్స్) కు 20 వేల బహుమతి చల్మెడ చేతుల మీదుగా అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ పాక రంజిత్ పొందగా 5వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. మిగతా జట్టు క్రీడాకారులకు మెడల్స్ ను అందజేశారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001లో కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీని స్థాపించిన విషయాన్ని గుర్తుచేస్తూ, పార్టీ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఈ టోర్నీని చేపట్టినట్లు తెలిపారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. గెలుపు -ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని తెలిపారు. ఈ టోర్నమెంట్ ను విజయవంతంగా ముగించిన కొనరావుపేట మండల నాయకులకు, టోర్నమెంట్ నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచులు నాగరాజు, అరవింద్ రావు, స్వామి, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, ఎదురుగట్ల చంద్రయ్య, గోపు పరశురాములు, భూమ్ రెడ్డి, మహేష్, శివతేజ, ప్రసాద్, మహేందర్, నవీన్, శ్రీనివాస్, జగన్, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు క్రీడాకారులు పాల్గొన్నారు.

# నిరాదరిస్తున్న కూతురుపై తండ్రి ఫిర్యాదు.

**జగిత్యాల ఏప్రిల్ 15(నేటి మన దేశమ్ ప్రతినిధి):** తన కూతురు మాధవి జగిత్యాల జంబిగద్దె వద్ద ఉన్న కోట్ల విలువైన తన ఆస్తిని గిఫ్ట్ డీడ్ చేయించుకొని పోషించడం లేదంటూ అట్టి రిజిస్ట్రేషన్ రద్దు చేసి తన పేరిట మార్పించాలని రాయికల్ మండలం మూటపల్లి గ్రామానికి చెందిన ఏనుగు లింగారావు( 80)అనే వృద్ధుడు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి జగిత్యాల ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోట వసంత కు ఫిర్యాదు చేశారు. సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం లో ఆయన విలేకరులకు తన గోడు వినిపించారు.తనకు సంబంధించిన ఆస్తి గిఫ్ట్ డీడ్ చేయించుకొని ప్రతి నెల పోషణ, వైద్యఖర్చులు ఇవ్వకపోవడంతో వృద్ధులమైన తల్లి దండ్రులము పలు ఆర్థిక, శా రీరక ఇబ్బందులు పడుతున్నామని అట్టి గిఫ్ట్ డీడ్ రద్దు చేసి తిరిగి నా పేరిట మార్పించి తగు చర్యలు తీసుకోవాలని, ఈ విషయం లో కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు ఎం. డి. యాకూబ్, ప్రకాష్, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

# న్యూ లక్ష్మీపురంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 15,నేటి మన దేశమ్** ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన ఈ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు.జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లెపొంగు రమేష్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజ్గర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడమే సీఎం రిలీఫ్ ఫండ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ క్రమంలో గుండెల షరాబందికి 45,000, గడ్డం నాగమ్మకు 30,000 చొప్పున మొత్తం 75,000 ల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షులు పోతురాజు పురుషోత్తం యాదవ్, వార్డు సభ్యులు పఠాన్ రేష్మ, మాజీ సభ్యులు మారుతి వీరయ్య, చెరుకూరి నాగేశ్వరరావు, సల్మాన్, పేరం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# రక్షిత ప్రమాణమై లక్ష్యంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పాటించాలి

**సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి**




**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** రక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్క రోడ్డు భద్రత సూచనలు పాటించాలని సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్,రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తా వద్ద వాహనదారులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వీయక్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను అరికట్టవచన్నారు. రోడ్డుపై ప్రయాణం చేసే సమయాల్లో మనం చేసే చిన్న చిన్న తప్పిదాలు మనతో పాటు ఎదుటివారిని కుటుంబాలని రోడ్డుపై పడేయచ్చని, ట్రాఫిక్ నింబంధనలు ఉన్నది మీ రక్షణ కోసమే అని ట్రాఫిక్ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యం చేరాలని తెలిపారు.వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, స్వీయారక్షణార్ధం హెల్మెట్ తప్పక ధరించాలని,వాహనాలు నడిపే సమయాల్లో మొబైల్ ఫోన్ వడాద్దని,తల్లిదండ్రులు మైనర్ పిల్లలు వాహనాలు ఇవ్వవద్దని మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు.జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వస్తున్నామని ప్రజలు వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ రక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఆర్ఐ సురేష్, ఎస్ఐ శ్రీకాంత్, ఆర్ ఎస్ఐ శ్రీనివాస్, పృథ్విధర్ పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఈ నెల 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అగ్నిమాపక దళ సిబ్బంది స్మారకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ఈవారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈవారం రోజుల పాటు జిల్లాలోని అన్ని స్కూల్స్, హాస్పిటల్స్, అపార్ట్మెంట్స్, గ్యాస్ గోడౌన్స్, పెట్రోల్ బంక్స్, సినిమా హాళ్లు,పరిశ్రమలకు వెళ్లి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ, అగ్ని ప్రమాదాలు తగ్గించడం ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, మంటలు ఆర్పడం, భవనాల నుంచి ఎలా బయటికి రావడం, పొగ నిండిన గదుల్లో నుంచి బయట పడడంపై తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, రమేష్, సురేష్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పిపోయిన వ్యక్తిని గుర్తించి పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్‌కు అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మనదేశమ్ ప్రతినిధి) ఏప్రిల్ 15**భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో తప్పిపోయిన వ్యక్తి గురించి అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు వేగంగా స్పందించి అతన్ని సురక్షితంగా గుర్తించారు. ఈ కేసును భద్రాచలం సబ్ఇన్స్పెక్టర్ జి. స్వప్న ఏప్రిల్ 12, 2026న నమోదు చేసి, తప్పిపోయిన వ్యక్తి వివరాలు మరియు ఫోటోను స్థానిక పత్రికలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు.విచారణ కొనసాగుతున్న సమయంలో, పిచుకలపాడు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ బనోత్ ఆనంద్ భద్రాచలం రాజుపేట కాలనీలో ఆటో నడుపుతుండగా ఒక వ్యక్తిని గుర్తించాడు. అతను ముందుగా వాట్సాప్‌లో చూసిన ఫోటోతో పోల్చి, ఆ వ్యక్తి తప్పిపోయినవాడేనని నిర్ధారించాడు.తక్షణమే పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆ వ్యక్తిని తన ఆటోలో భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ చేసిన సేవను ప్రశంసిస్తూ భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు ఎస్ఐ జి. స్వప్న అతనిని అభినందించి నగదు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ స్వప్న మాట్లాడుతూ, ప్రజలు ఇలాగే పోలీసులకు సహకరిస్తే సమాజంలో నేరాలను తగ్గించడంలో ఎంతో సహాయపడుతుందని, సహకరించిన వారికి తగిన ప్రోత్సాహం అందజేస్తామని తెలిపారు.




# చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



**అదిలాబాద్ ఏప్రిల్ 15 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట ప్రజలు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచించారు.ప్రియదర్శిని స్టేడియం లో ఆదిత్య ఖాడేస్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ వెల్ఫేర్ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీద ప్రారంభోత్సవం చేయడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలను నెలకొల్పి చల్లని నీటితో పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తూ ప్రజాసేవలో పాల్గొంటున్నటువంటి ఆదిత్య ఖండేశ్కర్ సొసైటీ చైర్మన్ ప్రశంసించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,మున్సిపల్ చైపర్సన్ బండారి అనూష సతీష్ ,డివైఎస్ఓ జక్కుల శ్రీనివాస్,కొమ్ము కృష్ణ ,పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత - అందరి బాధ్యత.మంత్రి పొన్నం ప్రభాకర్

**-ఘనంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమం**

**-బైక్ ర్యాలీని ప్రారంభించిన మంత్రి**



**అదిలాబాద్ ఏప్రిల్ 15 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని,అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనా-ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు.దేశంలో సహజ మరణాల కంటే,రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం అత్యంత ఆవేదన కలిగించే అంశమని అన్నారు.అనంతరం అంబెడ్కర్ చౌక్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని వాహనదారులకు హెల్మెట్లను పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ,గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య ,జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్,ఎస్పీ అఖిల్ మహాజన్,అదనపు కలెక్టర్ రాజేశ్వర్,ఆర్డీఓ స్రవంతి,రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి.రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్,అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె.హరీంద్ర కుమార్,అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద గంజాయి పట్టివేత

**- 33.6 కిలోలు స్వాధీనం, కారు సీజ్**


**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మనదేశమ్ ప్రతినిధి) ఏప్రిల్ 15** భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీలలో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. బుధవారం నిర్వహించిన తనిఖీలలో అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన ఒక కారును పరిశీలించగా, అందులో 33.6 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. తిరుపతి ఆదేశాల మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ చావా శ్రీహరి రావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.తనిఖీల సమయంలో ఒడి 30 ఎ 3732 నంబర్ గల కారులో ఈ గంజాయి నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వాహనానికి సంబంధించిన వ్యక్తుల కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ




ఎవరూ కనిపించలేదు. దీంతో గంజాయి మరియు కారును స్వాధీనం చేసుకుని, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్ రమేష్ బాబు, వీరబాబు, ప్రసన్న కుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు. గంజాయి రవాణా లేదా విక్రయాలపై ఏవైనా సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# చైనా నాలుగు పాయింట్ల ప్రతిపాదన



చైనా :పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవు తుండడంపై చైనా ఆందోళన వ్యక్తం చేసింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా బీజింగ్‌లో అబుదాబి క్రౌన్‌ప్రిన్స్ మహమ్మద్ బిన్ జాయేద్‌తో సమావేశ మయ్యారు. ఈక్రమంలోనే గల్ఫ్ దేశాల్లో శాంతి, స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిం చాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిన్‌పింగ్ నాలుగు అంశాలతో శాంతి ప్రతిపాదనను క్రౌన్‌ప్రిన్స్ ముందుం చినట్లు చైనా ప్రభుత్వ రంగ మీడియా కథనం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలో శాంతియుత సహజీవనం, జాతీయ సార్వ భౌమాధికారం, చట్టబద్ధమైన అంత ర్జాతీయ పాలన, అభివృద్ధి, ప్రపంచ భద్రత వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ రెండ్రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మంగళవారం చైనాకు చేరుకున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో కీలకమైన అంతర్జాతీయ విషయాలతో పాటు.. ద్వైపాక్షిక అంశాలపైనా చర్చలు జరపనున్నట్లు రష్యా విదేశాంగ శాఖ వెల్లడించింది.

# నైజీరియాలో విషాదం

## సంతపై పడిన బాంబులు - 100 మందికి పైగా మృతి



అబుజా : నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని యోబే రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సైన్యం జరిపిన వైమానిక దాడి మిస్ఫైర్ అయి వారపు సంతపై ఆ బాంబులు పడటంతో 100 మందికి పైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. జిలి గ్రామంలో సంత జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ఈ దాడిలో కనీసం 100 మందికి పైగా మరణించగా, రాయిటర్స్ నివేదికల ప్రకారం సంఖ్య 200 దాటింది.. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు సమా చారం. నైజీరియా వైమానిక దళం తమ లక్ష్యం ఉగ్రవాదుల స్థావరం, లాజిస్టిక్స్ కేంద్రాలే నని, "ఖచ్చితమైన దాడి" జరిపినట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ మాజీ ఉపాధ్యక్షుడు అటికు అబుబకర్ ఈ దాడిని ఖండిస్తూ, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈశాన్య నైజీరియాలో బోకో హరామ్, ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద చర్యలు గ్రూపుల పై సైన్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2017 నుంచి సైన్యం చేసిన దాడుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఈ తాజా ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

# స్టాలిన్ ఇంటి ఇంటికీ ప్రచారం



వెల్లోర్ (తమిళనాడు) : ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ మంగళవారం వెల్లూరులో ఇంటి ఇంటి ప్రచారం మొదలు పెట్టారు. వెల్లూరు నియోజక వర్గం నుంచి డిఎంకె అభ్యర్థి పి. కార్తికేయన్ పోటీ చేయ నున్నారు. ఈయ నకు ప్రత్య ర్థిగా ఎఐఎడిఎంకె తపు ఎస్ఆర్‌కె అప్పు బరిలో ఉన్నారు.

నేడు స్టాలిన్ చేపట్టిన ప్రచారంలో డిఎంకె అభ్యర్థిని గెలిపించమని ప్రజల్ని కోరారు. తన ప్రచారంలో ఓ టీ దుకాణం వద్ద ఆగి.. స్టాలిన్ ప్రజలతో ముచ్చటించారు.

# పశ్చిమ బెంగాల్‌లో 'ఐప్యాక్ ప్రకంపనలు'




మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ వినేష్ చండేల్‌కు ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం కస్టడీ విధించింది. 10 రోజుల పాటు ఈడీకస్టడీకి అప్ప గిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో వినేష్‌ను విచా రించిన అనంతరం ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ పరిణామాలు చర్చనీయాంశం అయ్యాయి. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభ కోణంతో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐ-ప్యాక్' సహ వ్యవస్థాపకుడు వినేష్ చండేల్‌కు సంబంధం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఈడీ.. చండేల్‌ను విచారించి అరెస్ట్ చేసింది. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. చండేల్ అరెస్ట్‌పై ఐప్యాక్ సంస్థ ఇంతవరకు స్పందించలేదు. బెంగాల్ లోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ మైన్స్‌లో వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు చోరీకి గురైనట్లు 2020లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇందులో నగదు అక్రమ చలామణి జరిగినట్లు తేల డంతో.. ఈ ఏడాది జనవరిలో ఈడీ దర్యాప్తు చేపట్టి ఐప్యాక్ కార్యాలయంపై దాడులు నిర్వహించింది.

# కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

## శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు




వాషింగ్టన్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించ కుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# ఇరాన్‌లో 1,104 గంటలుగా ఇంటర్నెట్ నిలిపివేత



టెహ్రాన్ : అమెరికా - ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇరాన్ అతలా కుతలమవుతుంది. యుద్ధం ప్రారంభమై 47 రోజులవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,104 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ నిలిచిపోయింది. దీంతో ప్రజలకు అంతర్జాతీయ కనెక్టివిటీ లేకుండా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ మేరకు ఇంటర్నెట్ పర్యవేక్షక సంస్థ నెట్ బ్లాక్ తెలిపింది. ఇరాన్‌పై దాడులకు పాల్పడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జనవరిలో హెచ్చరించాడు. ఆ నేపథ్యంలోనే డిజిటల్ సదుపాయం క్షీణించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం వల్ల అప్పటి నుంచి పూర్తిగా ఇంటర్నెట్ సేవలు నిలిచి పోయాయి. ప్రస్తుతం అంతర్గత నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నప్పటికీ.. అంతర్జాతీయ డిజిటల్ సేవలకు అంతరాయమేర్పడింది.

# మార్చి నెలలో రికార్డు స్థాయిలో ఎగుమతులు



న్యూఢిల్లీ : 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎగుమతులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. వస్తువులు, సేవల సంయుక్త ఎగుమతులు తొలిసారిగా 860 బిలియన్ డాలర్ల మార్కును దాటాయి. ఈ ఎగుమతులతో భారత్ ప్రపంచ వాణిజ్యంలో నిరంతర పురోగతిని, బలమైన పట్టుని సాధిస్తున్నట్లు సూచిస్తుంది. కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. గతేడాది 2025లో 825.26 బిలియన్ల మేర ఎగుమతులు జరిగితే.. ఈ ఏడాది 2026 ఏప్రిల్- మార్చి నెలల కాలంలో వస్తువులు, సేవల మొత్తం ఎగుమతులు 860.09 బిలియన్లకు పెరిగాయి. ఇది గతేడాది కంటే ఈ ఏడాది 4.22 శాతం మేర ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులలో ఈ ఏడాది సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం తెలిపింది.కాగా, ఈ ఏడాది వస్తువుల ఎగుమతులు 441.78 బిలియన్లకు చేరుకున్నాయి. ఇది మునుపటి ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 437.70. మొత్తంగా 0.93 శాతం పెరుగుదల ఉంది.

# జస్టిస్ స్వర్ణ కాంత్ శర్మ కేసులో కొత్త మలుపు




న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీ కేసులో సీబీఐ అప్పీలు విచారణ నుంచి ఢిల్లీ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ స్వర్ణ కాంత్ శర్మ తప్పుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేసిన కేసు కొత్త మలుపు తిరిగింది. బుధవారం కోర్టులో ఈ కేసుకు సంబం ధించిన అదనపు అఫిడవిట్‌ను మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేశారు. అందులో జడ్జి స్వర్ణ కాంత్ శర్మ పిల్లల ఎంప్యానెల్మెంట్ అంశంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ పిల్లలు ఇషాన్ శర్మ, శాంభవి శర్మలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న లీగల్ బ్రీఫ్స్, ఆర్థిక ప్రయోజనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లీగల్ రిపోర్టర్ సౌరవ్ దాస్ వెల్లడించిన ఆర్టీఐ గణాంకాలను ఆ అఫిడవిట్‌లో కేజ్రీవాల్ పొందుపరిచారు. ఇవి కేవలం గౌరవప్రదమైన పదవులు కావని.. కేంద్రం నుంచి నిరంతరం పని పొందుతున్న వృత్తి పరమైన నియామకాలని తెలిపారు. అంతేకాదు జడ్జి పిల్లలకు స్వయంగా సొలిసిటర్ జనరల్ కేసులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నిష్పక్షపాత విచారణపై తనకు ఆందోళన ఉందని మాజీ సీఎం కేజ్రీవాల్ వెల్లడించారు. ఒక వైపు సీబీఐ ప్రాసిక్యూట్ చేస్తూ, మరో వైపు జడ్జి కుటుంబ సభ్యులు కేంద్రం నుంచి పని పొందుతుంటే.. పక్షపాత వైఖరి ఉంటుందని కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మౌఖిక వాదనలు వినిపించేందుకు అదనపు సమయం కావా లంటూ కోర్టును కేజ్రీవాల్ కోరారు. తన 'రిజాయిండర్' హక్కును కూడా వినియో గించుకుంటానని ఈ సందర్భంగా కోర్టుకు కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

# అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

- వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు
- తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే - ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు



న్యూయార్క్ : అమెరికా ఆర్థిక వ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టం చేశారు. హెచ్-1బీ వ్యవస్థలో మోసాలు జరుగు తున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగ మ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. ఇరాన్‌తో చర్చల అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రి పోయేది కాదని అన్నారు. ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కుదరాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే ఈ సంప్రదింపులు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియ నుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరు కుంటున్నట్లు తెలుస్తోంది.

# నెలసరి సెలవును

## కచ్చితంగా, విశ్వసనీయం'గా అమలు చేయాలి : కర్ణాటక హైకోర్టు




బెంగళూరు : నెలసరి సెలవును -కచ్చితంగా, విశ్వసనీయంగా' అమలు చేయాలని కర్ణాటక హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెలసరి సెలవు(ఎంఎల్)పై ప్రతిపాదిత చట్టం అమల్లోకి వచ్చే వరకు, 18 నుండి 52ఏళ్ల వయస్సుగల మహిళా ఉద్యోగు లకు నెలసరి సమయంలో ఒక రోజు సెలవును మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేసే ఎంల్ విధానాన్ని సంబంధిత సంస్థలు కచ్చితంగా, విశ్వసనీయంగా అమలు చేసేలా చూడాలని ఆదేశించింది. బెళగావి జిల్లా, గోకాక్ తాలూకా ముదల్గిలోని ఒక హోటల్ లో పనిచేస్తున్న 41ఏళ్ల చంద్రవ్వ హనుమంత్ గోకవి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ ఉత్తర్వును జారీ చేశారు. కర్ణాటక నెలసరి సెలవు, పరిశుభ్రత బిల్లు, 2025 ప్రతిపాదిత చట్టంగా ఆమోదం పొందిన వెంటనే ఈ ఆదేశాన్ని పూర్తిస్థాయిలో, అర్థవంతంగా అమలు చేసేందుకు ఎటువంటి అనవసర జాప్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిబంధనలను రూపొందించాలని కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 14ను లోతుగా విశ్లేషించకుండా ఇచ్చిన ప్రస్తావన ఆధారంగా ఏర్పడిన నిరాధారమైన భయాలతో రాష్ట్రం వెనకడుగు వేయకూడదని లేదా పరిమితం కాకూడదని కోర్టు పేర్కొంది. చట్టం దృష్టిలో స్త్రీ పురుషులు సమానులే, కాని వారు జీవశాస్త్ర పరంగా విభిన్నమైన వారు. ముఖ్యంగా ఆరోగ్యం, గౌరవం, శారీరక స్వేచ్ఛకు సంబంధించిన విషయాలను గుర్తించడం అనేది సమానత్వ హామీని ఉల్లంఘించడం కాని, దానికి ఒక వాస్తవిక అర్థాన్ని ఇవ్వడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది.ఫ్యాక్టరీల చట్టం, 1948, కర్ణాటక దుకాణాలు, వాణిజ్యసంస్థల చట్టం, 1961, తోట కార్మికుల చట్టం, 1951, బిడి,సిగార్ కార్మికుల (ఉద్యోగ నిబంధనల) చట్టం,1966, మోటారు రవాణా కార్మికుల చట్టం, 1961కింద నమోదైన సంస్థల్లోని శాశ్వత, కాంట్రాక్ట్ , అవుట్ సోర్స్ మహిళా ఉద్యోగులందరికి ఎంఎల్ అందుబాటులో ఉంటుందని గతేడాది నవంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నోటిఫికేషన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్, కర్ణాటక ఎంప్లాయర్స్ అసోసియేషన్, బెంగళూరు ఎంప్లాయర్స్, 15మంది మహిళా ఉద్యోగులు పిటిషన్లు దాఖలు చేశారు. ఎంఎల్ విధానానికి మద్దతు ఇస్తూ వివిధ ట్రేడ్ యూనియన్లు, మహిళా న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్లు కోర్టులో మరో జడ్జి ఎదుట విచారణలో ఉన్నాయి.

# రోడ్డు భద్రతపై మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ - సీఐ శివశంకర్



**న్'రాయణ్'పేట ఏప్రిల్15 (నేటి మన దేశమ్ ప్రతినిధి)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకుఅర్రివె అలివే కార్యక్రమంలో భాగంగా నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలో నారాయణపేట పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మైనర్గా వాహనాలు నడుపుతున్న మొత్తం 16 మందిని గుర్తించి పట్టుకొని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్టపరంగా 18 సంవత్సరాలు నిండకముందు వాహనాలు నడపడం నేరమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల వారి ప్రాణాలకు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని హెచ్చరించారు. “మైనర్ డ్రైవింగ్ అనేది చిన్న తప్పు కాద అది ప్రాణాలపై ప్రమాదం. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి అని సీఐ శివశంకర్ అన్నారు. “డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్ట విరుద్ధం. నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించగలం” అని ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మళ్ళీ ఎవరైనా మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు, తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం వంటి భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అర్రివే అలివే కార్యక్రమం లక్ష్యం -- ప్రతి ఒక్కరు సురక్షితంగా గమ్యానికి చేరుకోవడం. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించడమే మా ధ్యేయం” అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, ఎస్ ఐ 2 గాయత్రి, పోలీస్ సిబ్బంది, స్థానిక పాల్గొన్నారు.

# ఏళ్ల నిర్లక్ష్యానికి ముగింపు... రూ.40 లక్షలతో గోపాల్ పేట్ బస్ స్టాండ్ పునర్నిర్మాణం

**ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషి ఫలితం**





**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గోపాల్ పేట్ బస్ స్టాండ్కు ఏళ్ల తరబడి కొనసాగిన నిర్లక్ష్యానికి తెరపడింది. శిథిలావస్థలో ఉండి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారిన ఈ బస్ స్టాండ్ను రూ. 40 లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. ఇప్పటి వరకు బస్ స్టాండ్ దయనీయ స్థితిలో ఉండటంతో, ప్రయాణికులు చెట్ల కింద ఎండలో నిలబడి, వర్షంలో తడుస్తూ బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చిన పరిస్థితి నెలకొంది. సమస్యపై పలుమార్లు వినతులు ఇచ్చినా గత ప్రభుత్వాలు, అధికారులు స్పందించకపోవడంతో ప్రజల్లో అసహనం పెరిగింది. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ స్వయంగా స్థలాన్ని పరిశీలించి, వెంటనే చర్యలు ప్రారంభించారు. రవాణా శాఖ మంత్రిని పలుమార్లు కలిసి నిధుల కోసం ఒత్తిడి తెచ్చి, చివరకు రూ. 40 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఆ నిధులతో పాత బస్ స్టాండ్ను పూర్తిగా మరమ్మత్తులు చేసి, ఆధునిక సదుపాయాలతో కొత్త రూపంలో నిర్మించారు. ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, “గోపాల్ పేట్ ప్రజలు చెట్ల కింద పిల్లలతో కలిసి బస్సు కోసం ఎదురు చూస్తున్న దృశ్యం నాకు తీవ్రంగా బాధ కలిగించింది. అప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడం నా బాధ్యత” అని తెలిపారు. అలాగే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ రవాణా వ్యవస్థ దెబ్బతిన్నదని, ప్రస్తుతం ప్రతి సమస్యకు పరిష్కారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా నిర్మితమైన బస్ స్టాండ్ ప్రారంభంతో గోపాల్ పేట్ ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడిగా ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ బాలికల వసతి గృహంలో తెల్లవారుజామున వరండాలో పడి విద్యార్థిని మృతి



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఎల్లారెడ్డి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ బాలికల వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న శ్రావణి అనే విద్యార్థి బుధవారం తెల్లవారు జామున వసతి గృహం వరండాలో పడి మృతి చెందింది. శ్రావణి తెల్లవారుజామున వాష్ రూమ్ కోసం వెళ్లి వస్తుండగా పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. వరండాలో విద్యార్థిని పడిపోవడాన్ని గమనించిన వసతి గృహం సిబ్బంది... హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. అక్కడ శ్రావణిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ ప్రేమ్, సీఐ రాజిరెడ్డి, ఎస్సై మహేష్ ఆస్పత్రికి చేరుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం వసతిగృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్? నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్?నకు చెందిన శ్రావణి తండ్రి లేకపోవడంతో వసతి గృహంలో ఉండి నాలుగేళ్లుగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. శ్రావణి తల్లి, అన్న, అక్క హైదరాబాద్ లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే శ్రావణి మృతి చెందడంతో హాస్టల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి పడి చనిపోయిందా.. గుండెపోటుతో చనిపోయిందా అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై అధికారులు వైద్యులతో విద్యార్థులతో చర్చిస్తున్నారు. అయితే వసతిగృహంలో నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపిస్తూ హాజీపూర్ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. వారంతా స్థానిక పోలీస్?స్టేషన్?కు తరలివచ్చారు సమగ్ర విచారణ చేయాలని డిమాండ్? చేశారు.

# భయాందోళనల మధ్య “ఖని సింగరేణి ఆసుపత్రి”

- భయకంపితులైన పారామెడికల్ సిబ్బంది
- సెక్యూరిటీ సిబ్బందిపై దాడి
- ఆసుపత్రిలో మద్యం సేవించి దురుసు ప్రవర్తన, నానా హంగామా..



**పెద్దపల్లి ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఇటీవల జరుగుతున్న సంఘటనల వల్ల సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు, పారామెడికల్ స్టాఫ్ మరియు ఇతర సహాయక సిబ్బంది భయాందోళనల మధ్య విధులు నిర్వహిస్తూ తమకు రక్షణ కల్పించాలని వాపోతున్నారు. ఇటీవల ఓ గనిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మైన్ గాయము రిపోర్ట్ కారణంగా ఆర్తో వార్డులో ఉండగా అతనిని చూడడానికి వచ్చిన రోగి యొక్క అటెండెంట్ లు మద్యం సేవించి ఇష్టం వచ్చినట్లు ఆసుపత్రి సిబ్బందిపై దుర్భాషలాడుతూ హంగామా సృష్టించారు. దీనిని అడ్డుకోవడానికి వచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై చేయి చేసుకున్నారు. సీనియర్ స్టాఫ్ నర్సులు, వార్డులో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్లు అవహేళన చేస్తూ గొడవకు దిగారు. వార్డులో బయటి ఆహారం అనుమతి లేకున్నా అక్కడే మందు సేవించి ఆహారం తీసుకొని గొడవకు దిగగా దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆస్పత్రి సిబ్బంది గొడవను తగ్గించుటకు ఎంత ప్రయత్నించినా వినకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది పోలీసు వారికి సమాచారం అందించిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కొద్దిసేపు అతనికి నచ్చజెప్పగా అయినప్పటికీ వినకపోవడంతో పోలీసు వారు అతడిని స్టేషన్ కి తరలించారు. ఈ సంఘటన పట్ల ఆసుపత్రి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా ఎటువంటి రక్షణ చర్యలు కల్పించడం లేదని వారు వాపోతున్నారు. ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధులకు రోగి సహాయకులు గుంపులు గుంపులుగా వచ్చి విధులకు ఆటంకం కల్పిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్లో ప్రొసీజర్స్ చేస్తున్న సమయంలో బయటకు వెళ్లకుండా సిబ్బందిపైనే తిరగబడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఒక స్టాఫ్ నర్స్ పై రోగి చేయి చేసుకున్నట్లు కూడా తెలుస్తుంది. అత్యవసర సమయంలో కీలకంగా వ్యవహరిస్తూ అనేక మంది ప్రాణాలు కాపాడుతున్న వైద్య సిబ్బందిపై తరచుగా దాడులు జరగడం ఆక్షేపనీయమని వారు వాపోతున్నారు. ఈ విధంగా కొంతమంది చేస్తున్న ఇబ్బందికరమైన పనుల వల్ల వేరే రోగులకు అందించే వైద్య సేవలో ఇబ్బంది కలుగుతున్నట్లు వారు చెపుతున్నారు. ఇటీవల కాలంలో ఒక నర్స్ కుటుంబంపై కూడా దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఇంతటి భయానక పరిస్థితుల మధ్య పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వహించడం కష్టతరంగా మారుతుంది. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు అంతేకాకుండా సింగరేణి సెక్యూరిటీ విభాగంతో పాటు పోలీసు వారు పెట్రోలింగ్ సమయంలో ఇక్కడ గస్తీ ఏర్పాటు చేయడం లేదా శాశ్వతంగా పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి గొడవలకు లేదా దాడులకు దిగే చిల్లర మూకలపై ఉక్కు పాదం మోపాలని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కోరుతున్నారు.


# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగం పై జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి.

**ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు- గడువులోపు పూర్తి చేయాలని ఆదేశాలు.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15, (నేటి మనదేశమ్)**,సుజాతానగర్ మండలం మర్రి తండ గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం, ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లేబర్ చార్జీలు ఎంత అవుతున్నాయి, అదనంగా లబ్ధిదారులు ఎంత మొత్తం వెచ్చిస్తున్నారు వంటి అంశాలపై ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు. ఈ క్రమంలో మూడ్ మౌనిక, హాథిరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ తదితర లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో సుమారు 650 మంది జనాభా ఉండగా, వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని కలెక్టర్ గమనించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి అదనంగా లబ్ధిదారులు స్వంతంగా పెట్టుబడి పెట్టి, తామే స్వయంగా ఇళ్ల నిర్మాణంలో పాల్గొనడం ద్వారా లేబర్ ఖర్చులను తగ్గించుకుంటూ ఇళ్లను నిర్మించుకుంటున్న విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇళ్ల విస్తీర్ణం, నిర్మాణ పరిమాణాన్ని అధికారులతో టేప్తో కొలిపించి నిర్ధారించారు. ఎలాంటి నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అన్ని నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని, పనుల పురోగతిపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ మరియు సర్జికల్స్ ప్రారంభోత్స కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి ఫార్మసీ మరియు సర్జికల్స్ ప్రారంభోత్స కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మజీద్,అంజాద్, సత్యం, గణేష్ ,బబ్లు ,లడ్డు ,సిద్దిక్, జావీద్,స్వప్న లక్ష్మి నారాయణ,ఫార్మసీ సిబ్బంది ,దిలీప్ ,సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి భిక్నూర్ ఆలయ చైర్మన్ పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు



**కామారెడ్డ్,ఏప్రిల్ 15.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**భిక్నూర్ సిద్ద రామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మరియు ఆలయ డైరెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ని మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సమస్యలు విన్న షబ్బీర్ అలీ వెంటనే స్పందించి ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్ లింబాద్రి, దయాకర్ రెడ్డి, ఆలయ డైరెక్టర్లు చీకోటి ప్రభాకర్ మొదలగువారు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



**ర్'జన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15 : (నేటి మన దేశమ్) ప్రతినిధి** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీబీపీసీలో కీర్తన 436/440, మర్రిపల్లి కేజీబీవీ ఎంపీసీలో బీ మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జీ మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎంపీ హెచ్ డబ్ల్యూలో ఎల్ శృతికి490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, మర్రిపల్లి కేజీబీవీలో జీ శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాలసముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, కేజీబీవీ వేములవాడ (అర్బన్), (రూరల్), సిరిసిల్ల ( అర్బన్) స్పెషల్ ఆఫీసర్స్ సిహెచ్.స్వప్న, బి. పద్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

## జీ పి ఏ చేసిన భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా పట్టా ఆర్డిఓ ఆఫీస్ ముందు అర్ధనగ్న ప్రదర్శన





**కోదాడ, ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** మండలంలోని ద్వారకుంట రెవెన్యూ పరిధిలో134. వ సర్వే నెంబర్లు 5 ఎకరాల రెండు గుంటల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులు కోదాడకు చెందిన జలీల్ నాయక్ పేరుమీద మార్చారని. బాధితుడు జహీర్ అహ్మద్ బుధవారం కోదాడ ఆర్డిఓ కార్యాలయం ముందు అర్థనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపాడు. తన తల్లి మహమ్మద్ ఉన్నిసా బేగం పేరు మీద ఈ భూమి ఉందని గత ఏడాది జూలైలో సేల్ కం జిపిఏ డాక్యుమెంట్ తో పాటు ఈ భూమిని నాళ కన్వర్షన్ మరియు ముటిషన్ చేశారని వాపోయాడు. తాసిల్దార్ కార్యాలయంలో పనిచేసే సస్పెండ్ అయిన ధరణి ఆపరేటర్ వెంకయ్య ఈ దందాలో కీలక వ్యక్తిని ఆరోపించారు. ఇట్టి భూమిని పంచనామ సైతం ఆర్ ఐ జగదీష్ భూమి వద్దకు వెళ్లి పక్కన రైతులతో కాకుండా వారికి అనుకూలమైన వ్యక్తులతో సాక్షి సంతకాలు చేయించి పంచినామా చేశారని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ముడుపులు తీసుకుని రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. తహసిల్దార్ వివరణ: –కోదాడ తాసిల్దార్ వాజిద్ అలీనీ ప్రశ్నించగా తాను ఏ తప్పు చేయలేదు సేల్ ఎగ్రిమెంట్లో పూర్తి పైకం డబ్బులు ముట్టాయని ఉంది దానిని ఆధారంగా చేసుకుని ముటీషన్ చేసి పట్టా చేశామన్నారు. ఎవరి దగ్గర ఎలాంటి ముడుపులు తీసుకోలేదని, బాధితులను చట్టపరంగా న్యాయంగా వెళ్లవచ్చు అని అన్నారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ పరామర్శ



**వేములవ్'డ, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి**వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెకు చెందిన సాహెబ్ బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుర సంతోష్ రెడ్డి, సాహెబ్ అలీ, ఖాజా జిలాని, శౌకత్, బర్కత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రాణాలు అమూల్యం

**రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి**

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాతవాహన యూనివర్సిటీలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్, మరియు రవాణా శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల 3వ రోజు కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, ఈ నెల 13 నుండి 18 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అలవాటు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువ. పోలీసుల కఠిన చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గింది, ప్రభుత్వ ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది. హిట్ అండ్ రన్ బాధితులకు కూడా ఆర్థిక సాయం అందుతుంది. ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి అందజేస్తుంది. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై సిపి అవగాహన కల్పించారు శాతవాహనయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, తమ విద్యాలయ ప్రాంగణం డ్రగ్ ఫ్రీగా ఉందని, ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు క్యాంపస్ అంతటా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ అధికారి (ట్రైనీ ఐపీఎస్) సోహం సునీల్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం...!

**-ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్.**



**కరీంనగర్, ఏప్రిల్ 15: నేటి మన దేశమ్ ప్రతినిధి** పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబందించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది. బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్ మరియు న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, వార్డు సభ్యులు చెన్నబోయిన రవి, పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు, రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నోటీసు ఇవ్వకుండానే స్థల ఆక్రమణ బాధితుడు వేముల శ్రీనివాస్



**కోదాడ, ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** కోదాడ పట్టణానికి చెందిన వేముల శ్రీనివాస్ అనే వ్యక్తి కోదాడ– మేళ్లచెరువువెళ్లే రోడ్లో చాలా కాలం నుండి తాను2008 లో గఫూర్ అనే అతను దగ్గర 152 గజాల ఈ స్థలమును కొనుగోలు చేశాడు. ఈ స్థలంలో చాలా కాలం నుండి మెకానిక్ షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. కొంతమంది ఒత్తిళ్ళ మేరకు మున్సిపల్ ఆఫీస్ వాళ్లు గతంలో ఈ



స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేయడంతో బాధితుడు తన సొంత భూమి కావడంతో వేముల శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టుకు మున్సిపల్ కమిషనర్ హాజరై లీగల్ గా అన్ని శ్రీనివాస్ కే ఉన్నవీ మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పేసిందన్నారు. మళ్లీ ఇప్పుడు, రోడ్డు విస్తరణ కొరకు 24 ఫీట్ల రోడ్ తీయాలని ఆలోచన, కమిషనర్ కు కలిగింది చాలా మంచి ఆలోచన, కానీ అది తాను కొనుగోలు చేసిన సొంత భూమి కాబట్టి, తనతో సంప్రదింపులు జరపాలి కదా అంటున్నాడు. కొంతమంది రాజకీయం అడ్డుపెట్టుకొని ఈ శ్రీనివాస్ స్థలం వెనకాలో ప్లాటు ఉండటంతో ఆ ప్లాట్ కు భూమి రేటు కోట్లకు పెరగాలని కమిషనర్ ను ఒత్తిడి చేయించి ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే తన స్థలాన్ని జెసిబి తో కొల్లగొట్టి ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని లేని పక్షంలో తాను ఆత్మహత్య శరణ్యమని బాధితుడు వాపోతున్నాడు.

# విద్యుత్ సంస్థ లో పనిచేసే ఎంప్లాయిస్ ను పర్మినెంట్ చేయాలి

**కాశీ నాథ్ టీ యూ సీ ఐ**




**న్ారాయణ్‌పేట ఏప్రిల్ 15(నేటి మన దేశమ్ ప్రతినిధి)** నారాయణ పేట్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు జరిగే విద్యుత్ ఎంప్లాయిస్ "నిరవధిక సమ్మె" శిబిరాన్ని ట్యూసి కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. కాశీనాథ్ టీ యూ సీ ఐ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంబదాస్ లు సందర్శించి, సమ్మె కు టీ యూ సీ ఐ కార్మిక సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా "కారంటోల సమ్మె" జరుగుతుంది. దీనికి ప్రజలు, విద్యుత్ వినియోగ దారులు, మేధావులు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలి. తోటి కార్మికులు గత 20–25 సంవత్సరాల నుండి కార్మికులు చాలి చాలని తక్కువ జీతాలతో విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారు. శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. శ్రమ దోపిడీకి గురువుతున్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తున్నామని నమ్మించి మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నాము. టిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ లు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా "కంట్రాటీకరణ "విధానాన్ని ప్రపంచ బ్యాంకు కు తలొగ్గి భారతదేశంలో అమలు చేస్తా ఉన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు వ్యతిరేకించాలనారు. వెంటనే ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేసే ఎంప్లాయిస్ ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూనాము. లేని పక్షం లో ఆందోళన ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకుడు నీలి దామోదర్, వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు

# రోడ్ భద్రతపై అవగాహన అవసరం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 15 (నేటి మన దేశమ్ ప్రతినిధి** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంపు అత్యంత అవసరమని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. మొదట ఆదిలాబాద్‌లోని ఒక పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన " అవేర్నెస్ --అలివేలు " రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని, ప్రమాదాలు జరిగిన తరువాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. తదనంతరం సభాధ్యక్షులుగా పాల్గొన్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు బాధితులతో పాటు వారి కుటుంబాల జీవితాలను కూడా ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. వాహనం కొనుగోలు చేసే సమయంలో ఇన్సూరెన్స్ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రజాసేవకు తోడ్పడే స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించడం అవసరమని తెలిపారు. కార్యక్రమాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ,డివైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, కొమ్ము కృష్ణతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ.

**- విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి" : జిల్లా కలెక్టర్ అంకిత్.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15, (నేటి మనదేశమ్)**, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ -- అ లైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు . చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తుచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "అరైవ్ -- అ లైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏం ఈ ఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చిన కేజీబీవీ ( అర్బన్ ) విద్యార్థిని కి జిల్లా కలెక్టర్ అభినందన



**వేములవాడ, ఏప్రిల్15 (నేటి మనదేశమ్):** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వేములవాడఅర్బన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, వేములవాడ లోని అర్బన్ కేజీబీవీ విద్యాలయాలకు చెందిన విద్యార్థిని ఏఐఎంఎల్ లో అక్షిత486/500 ఉత్తమ ప్రతిభ కనబర్చి మార్కులు సాధించింది. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి, జి సీ డి ఓ పద్మజ, కేజీబీ వి వేములవాడ అర్బన్ స్పెషల్ ఆఫీసర్ సిహెచ్. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష సమావేశం

**- పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 15: పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బూర్గంపాడు మండలం సారపాకలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి, ఇంకా ఎన్ని ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలను వివరంగా సమీక్షించారు. పనులు ఆలస్యం అవుతున్న చోట తక్షణ చర్యలు తీసుకుని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు, ఇతర శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

**విద్యార్థులకు విస్తృత రోడ్డు భద్రత అవగాహన**



**జగిత్యాల,ఏప్రిల్ 15(నేటి మన దేశమ్ ప్రతినిధి)::** చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అలవరచుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చనే లక్ష్యంతో అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మూడవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ద్వారా తల్లిదండ్రుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు "డియర్ పేరెంట్స్, ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్" అనే సందేశంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు హెల్మెట్ కొనివ్వమని లేఖలు రాయడం ద్వారా కుటుంబ స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించవచ్చని సూచించారు. విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, స్కూల్‌కు వెళ్లే సమయంలో ఇరుపక్కల చూసుకుని జాగ్రత్తగా దాటడం, స్కూల్ బస్సులో ఎక్కడం, దిగడం సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అలవాట్లు నిత్యజీవితంలో పాటించాలని సూచించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com